ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
సోమవారం, 25 మార్చి 2024
5



	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	38	25
భద్రాద్రి	38	24

రంజాన్‌మాసం



ఇఫ్తార్ (సా) : 6:27 (సోమవారం)
సహర్ (ఉ) : 4:47 (మంగళవారం)



రంగుల కేళీ..

- ఇరుజిల్లాల్లో జోరుగా హోలీ సంబురాలు
- ప్రైవేటు ఈవెంట్లలో యువత సందడి
- పలుప్రాంతాల్లో కామదహనం
- నేడు పూర్తిస్థాయి వేడుకలు

ఖమ్మం సాంస్కృతికం / కొత్తగూడెం సాంస్కృతికం, మార్చి 24: ఐక్యతకు, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రంగుల పండుగ హోలీకి వేళైంది. ఆదివారం రాత్రి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా యువత కామదహనం చేశారు. కామదహనం జరిగిన మరుసటి రోజు హోలీ పండుగను నిర్వహించడం సంప్రదాయం. అయితే ఈసారి హోలీ వేడుకలను రెండు రోజులపాటు నిర్వహిస్తున్నారు. ఇరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఆదివారం హోలీ ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్యంగా ఆదివారం సెలవుదినం కావడంతో ముందుగానే కొందరు హోలీ ఈవెంట్లు నిర్వహించారు. ముఖ్యంగా ఖమ్మం నగరంలో ఆదివారం పలు ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో హోలీ వేడుకలు నిర్వహించారు. క్యాలెండర్ ప్రకారం హోలీ సోమవారం అయినా ఆదివారం సెలవు దినం కావడంతో పలుచోట్ల ఈవెంట్లు నిర్వహించారు. ఖమ్మం బైపాస్‌రోడ్‌లో సామూహిక హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల రంగుల ఉట్టి కొట్టడం, రెయిన్ డ్యాన్స్‌లు, టమాటా ఫైటింగ్, దాండియా నృత్యాలు ఏర్పాటు చేశారు. నిర్ణీత రుసుం చెల్లించిన పలువురు తమ కుటుంబాలతో సహా వేడుకల్లో పాల్గొన్నారు. పంచాంగం ప్రకారం సోమవారం హోలీ నిర్వహించాలనుకున్నవారు ఆదివారం రాత్రి కామ దహనం నిర్వహించారు. నగరంలోని పలు కూడళ్ల వద్ద కట్టెలు, పాత ఫర్నిచర్‌తో కామదమనం ఉత్సవాలు నిర్వహించారు.

నేడు లిక్కర్ కిక్కుకు బ్రేక్

- ఖమ్మం జిల్లాలో వైన్స్ షాపుల బంద్
- అల్లర్లు జరగకుండా సీపీ చర్యలు

7

భద్రాద్రిలో నేడు
వసంతోత్సవం

- సంప్రదాయబద్ధంగా అంకురార్పణ
- నేడు తలంబ్రాల తయారీకి శ్రీకారం

భద్రాచలం మార్చి 24: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో హోలీ పండుగ సందర్భంగా నిర్వహించే డోలోత్సవానికి, వసంతోత్సవానికి ఆదివారం సంప్రదాయబద్ధంగా అంకురార్పణ నిర్వహించారు. ముందుగా గోదావరి నుంచి తీర్థ బిందెను తీసుకొచ్చి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హోలీ పౌర్ణమిని పురస్కరించుకొని స్వామివారికి నేడు సహస్రధారతో ప్రత్యేకస్నపనం నిర్వహించనున్నారు. అనంతరం స్వామివారిని ఉయ్యాల్లో ఆశీనులను చేసి డోలోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆస్థాన గాయకులు రామదాసు, తూము నరసింహదాసు కీర్తనలను ఆలపిస్తుండగా నక్షత్ర, కుంభహారతిని స్వామివారికి ప్రత్యేకంగా సమర్పించనున్నారు. వసంతోత్సవంలో భాగంగా ముందుగా ప్రధాన ఆలయంలోని ధ్రువమూర్తులకు, ఆంజనేయస్వామికి, లక్ష్మీ తాయారు అమ్మవారికి శాస్త్రోక్తంగా వసంతం జల్లుతారు. అనంతరం వసంతోత్సవ కార్యక్రమానికి చిహ్నంగా భక్తులపై పసుపు నీళ్లను చల్లుతారు. సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ నిర్వహిస్తారు. డోలోత్సవం, వసంతోత్సవం నిర్వహించిన రోజు భద్రాద్రి రామయ్యను పెళ్లికుమారుడిని చేసినట్లు స్థానికులు విశ్వసిస్తారు. ఈ ఉత్సవాల సందర్భంగా సోమవారం స్వామివారి నిత్యకల్యాణాన్ని నిలిపివేశారు.



మిథిలా స్టేడియంలోని కల్యాణ మండపానికి రంగులు



అంకురార్పణ కోసం తీర్థబిందెను తీసుకొచ్చిన దృశ్యం

ఈసారి 300 క్వింటాళ్ల తలంబ్రాలు

శ్రీరామనవమిని పురస్కరించుకొని శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణానికి వినియోగించే తలంబ్రాల తయారీకి నేడు శ్రీకారం చుట్టనున్నారు. దేవస్థానం వైదిక సిబ్బంది, వారి సతీమణులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. గతేడాది శ్రీరామ నవమికి 250 క్వింటాళ్ల తలంబ్రాలు సిద్ధం చేయగా ఈసారి 300 క్వింటాళ్లు సిద్ధం చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం మిథిలా స్టేడియం ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. భద్రాద్రి రామయ్య కల్యాణ తలంబ్రాల కోసం 128 క్వింటాళ్ల బియ్యాన్ని ఏపీలోని జంగారెడ్డిగూడెం శ్రీరామ ఆధ్యాత్మిక సేవా సమితి భక్త బృందం భద్రాచలానికి పాదయాత్ర ద్వారా తీసుకొచ్చింది. దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, వేద పండితులు లింగాల రామకృష్ణ ప్రసాద్‌లకు ఈ బియ్యాన్ని శ్రీరామ ఆధ్యాత్మిక సేవా సమితి అధ్యక్షుడు ముళ్లపూడి సత్యనారాయణతోపాటు భక్త బృందం అందజేశారు.

నవమి పనులు షురూ

- మిథిలా కల్యాణ మండపానికి పంచరంగులు
- నేటి నుంచి ఆన్‌లైన్‌లో కల్యాణం, పట్టాభిషేకం టికెట్లు

7



పూటీ పందెంలో ఖమ్మం ఎడ్లకు
ప్రథమస్థానం

- ఆంధ్రా ఎద్దులకు ద్వితీయం
- బనిగండ్లపాడులో పోటీ

7

జంట తండాల్లో
జోడు సంబురాలు

- లోక్యాతండా, జగమాల్‌తండాల్లో వేడుకలు

7



సబ్సిడీ సన్నబియ్యం జాడేదీ?

కానరాని 'భారత్ రైస్' కేంద్రాలు



- ఉమ్మడి జిల్లాలో ఊసులేని కేంద్ర ప్రభుత్వ బియ్యం పథకం
- మార్కెట్‌లో ఆకాశాన్నంటుతున్న సన్నబియ్యం ధరలు
- ధరల అదుపునకు చర్యలు కరవు
- విలవిలలాడుతున్న సామాన్యులు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 24: సామాన్యుడికి సన్నబియ్యం బువ్వ అందని దాక్షాగా మారుతోంది. మార్కెట్‌లో మండిపోతున్న ధరలతో పేదలు సన్నబియ్యం కొనలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పేదలకోసం 'భారత్ రైస్' పేరుతో సబ్సిడీ బియ్యం పథకాన్ని తీసుకొచ్చింది. కానీ ఈ పథకం ఉమ్మడి జిల్లా వాసులకు దక్కడం లేదు. మార్కెట్లో సన్నబియ్యం ధరలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం కిలో బియ్యం సుమారు రూ.65 వరకు పలుకుతోంది. ఈ నేపథ్యంలో బియ్యం ధరలను అదుపులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 6న 'భారత్ రైస్'ను ప్రకటించింది. కానీ ఈ బియ్యం జిల్లా వాసులకు దక్కడం లేదు. కేంద్ర ప్రభుత్వం సన్నరకాలను ఇతర దేశాలకు ఎగుమతి చేయకుండా నిషేధించినా సామాన్యులకు మాత్రం సన్నబియ్యం దక్కడం లేదు. బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ధరలను అదుపు చేసేందుకు కిలో రూ29కే కేజీ బియ్యం విక్రయించేందుకు కేంద్రం 'భారత్ రైస్' పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా 5, 10 కేజీల ప్యాకెట్లలో బియ్యం విక్రయించాలని కేంద్ర మంత్రి ప్రకటించారు. కానీ ఈ బియ్యం కేంద్రాలను రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా అందుబాటులోకి తీసుకురాలేదు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోనూ వీటిని ఏర్పాటు చేయలేదు. మార్క్‌ఫెడ్ ద్వారా విక్రయాలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా.. ఆ కేంద్రాలు ఎక్కడ పెట్టారో కూడా తెలియని పరిస్థితి. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులకు కూడా భారత్ బియ్యం విక్రయాలపై ఎలాంటి సమాచారం లేకపోవడం గమనార్హం.

అక్రమార్కుల దందా.. నియంత్రణ లేని నిఘా ?

పేదలకు రూపాయికే కిలో చొప్పున అందిస్తున్న రేషన్ బియ్యం అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. జిల్లాలో సామాన్యుల, మధ్యతరగతి అన్ని వర్గాల ప్రజలకు అవసరమయ్యే బియ్యాన్ని కొందరు అక్రమార్కులు రేట్లు పెంచి మరీ దందా కొనసాగిస్తున్నారు. గ్రామాల్లో సేకరించిన రేషన్ బియ్యాన్ని రైసుమిల్లుల్లో రీ సైక్లింగ్ చేసి సన్నబియ్యం పేరుతో ఇక్కడే అధిక ధరలకు విక్రయిస్తున్నారు. రేషన్‌బియ్యం అక్రమ దందా యథేచ్ఛగా సాగుతున్నా వీటిని అదుపుచేసే వారు కరువయ్యారు. దీంతో బియ్యం ధరలతో జనం బెంబేలెత్తుతున్నారు. వాస్తవానికి అధికార యంత్రాంగం మార్కెట్లలో ధరలను నియంత్రించేందుకు ప్రైస్ మార్కెటింగ్ కమిటీలతో సమావేశాలను నిర్వహించి అధిక ధరలను అరికట్టాల్సి ఉంది. కానీ జిల్లాలో ఆ దిశగా ఎక్కడా కూడా సామాన్యుల పక్షాన ఈ దిశగా చర్యలు, సమీక్షలు నిర్వహించిన దాఖలాలే లేవు. జిల్లాలో యథేచ్ఛగా బియ్యం రీసైక్లింగ్, రేషన్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నా అధికార యంత్రాంగం మాత్రం గుడ్లప్పగించి చూస్తుంది తప్ప చర్యలు నామమాత్రమే.

బియ్యం ధరలను నియంత్రించాలి



దరిపల్లి శ్రీనివాస్, ఖమ్మం

మార్కెట్లో బియ్యం ధరలు విపరీతంగా పెరిగాయి. సామాన్యులు బియ్యాన్ని కొనుగోలు చేసే పరిస్థితి లేదు. మళ్లీ నూకలు తినే రోజులొచ్చాయి. ప్రభుత్వాలు బియ్యం ధరలను నియంత్రించాల్సిన అవసరం ఉంది. బియ్యం డిపోలను ఏర్పాటు చేసి సన్నబియ్యాన్ని రేషన్‌దుకాణాల ద్వారా పంపిణీ చేయాలి. ప్రస్తుతం రేషన్ దుకాణాలకు దొడ్డుబియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. వాటిని తీసుకోవడానికి, తినడానికి ప్రజలు ఆసక్తి చూపడం లేదు.

భారత్ బియ్యం కౌంటర్లు ఏర్పాటు చేయాలి



పోట్ల స్వాతి, గృహిణి

కేంద్రప్రభుత్వం సామాన్యుల కోసం ఏర్పాటు చేసిన భారత్ బియ్యం కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలి. వీటితో పాటు బియ్యం ధరలను నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం రబీ సీజన్‌లో ధాన్యం పండక పోవడంతో బియ్యం ధరలు ఇంకా పెరిగే ఆస్కారం ఉంది. మధ్యతరగతి ప్రజలకు సన్నబియ్యాన్ని ప్రభుత్వమే అందిస్తే మార్కెట్లో ధరలు అందుబాటులోకి వస్తాయి.

బియ్యం ధరల నియంత్రణపై చర్యలు తీసుకుంటాం : చందన్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి



బియ్యం ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నాం. మార్కెట్లో బియ్యం ధరల నియంత్రణకు ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశాలను ఏర్పాటు చేసి మిల్లర్లతో సమీక్షిస్తాం. అధిక ధరలకు బియ్యాన్ని విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. రేషన్ బియ్యాన్ని ఎక్కడైనా రీసైక్లింగ్ చేసి విక్రయించినా చర్యలు తీసుకుంటాం. ప్రజలు సామాన్యులు ఇలాంటి సమాచారాన్ని అధికారులకు అందిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. భారత్ బియ్యం విక్రయాలపై తమ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. మార్క్‌ఫెడ్ ద్వారా కేంద్రాలను ఏర్పాటు చేశారని తెలుస్తోంది.

ఖమ్మం లోక్‌సభ బీజేపీ అభ్యర్థిగా
తాండ్ర వినోద్‌రావు

ప్రకటించిన ఆ పార్టీ అధిష్ఠానం



ఖమ్మం, మార్చి 24 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): బీజేపీ ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థిగా ఆ పార్టీ సీనియర్ నేత తాండ్రవినోద్‌రావును పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. దాంతో బీజేపీ అభ్యర్థి విషయంలో నెలకొన్న ఉత్కంఠ తొలగిపోయింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్ల మండలం తిమ్మంపేట గ్రామానికి చెందిన తాండ్ర వినోద్‌రావు బీజేపీలో రాష్ట్రస్థాయి కీలక నేతల్లో ఒకరుగా ఉన్నారు. బీజేపీలో కొనసాగుతూనే ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమాల్లో కూడా వినోద్‌రావు కీలకపాత్ర పోషిస్తున్నారు. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబంలో జన్మించిన వినోద్‌రావు ఇంటర్‌వరకు పాల్వంచలో చదువుకున్నారు. అమెరికాలో డబుల్ పోస్టు గ్రాడ్యుయేట్ వరకు చదువుకుని అనంతరం స్వదేశానికి తిరిగి వచ్చారు. దశాబ్దకాలంగా ఏకలవ్య ఫౌండేషన్ ద్వారా తెలంగాణాలోని పలు గిరిజన ప్రాంతాల్లో విద్యా వైద్యం ఉపాధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఏకలవ్య ఫౌండేషన్ ద్వారా పలు సామాజిక కార్యక్రమాలను కొనసాగిస్తూనే బీజేపీ కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. అయోధ్య రామాలయం అక్షితలను రాష్ట్రవ్యాప్తంగా పలు ఆలయాలకు పంపిణీ చేసిన కార్యక్రమానికి వినోద్‌రావు సమన్వయకర్తగా వ్యవహరించారు. బీజేపీలోని పలువురు పెద్దలు ఆరెస్సెస్‌లోని పలువురు నేతల ఆశీస్సులు వినోద్‌రావుకు ఉండడం వల్లనే ఆయనకు బీజేపీ టిక్కెట్ లభించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆయన గత మూడు నెలలుగా జిల్లాలో పార్టీ కార్యక్రమాలను బూత్‌స్థాయిలో నిర్వహించడం, క్యాడర్‌ను సమన్వయం చేసుకుని లోక్‌సభ ఎన్నికల కోసం ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు. ఖమ్మం బీజేపీ టిక్కెట్ విషయంలో పలువురు నేతలు పోటీలో ఉన్నా వినోద్‌రావుకే అవకాశం దక్కడం గమనార్హం.

తల్లిని హతమార్చిన తనయుడు

- మద్యం మత్తులో దాడిచేసిన వ్యక్తి
- అనంతరం పోలీసుల ఎదుట లొంగుబాటు

6

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఈత నేర్చుకునేందుకు వెళ్లి..

కిన్నెరసాని చెక్‌డ్యాంలో మునిగి పదో తరగతి విద్యార్థి మృతి



సంపత్‌కుమార్ మృతదేహం

పాల్వంచ, మార్చి 24: సరదాగా స్నేహితులతో కలిసి ఈత నేర్చుకునేందుకు వెళ్లిన ఓ 10వ తరగతి విద్యార్థి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలో ఆదివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పాతసూరారం గ్రామానికి చెందిన జక్కుల సంపత్‌కుమార్(16) పాండురంగాపురంలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ప్రస్తుతం పాల్వంచలో వార్షిక పరీక్షలు రాస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో తన స్నేహితులైన వేణు, సాయిలతో కలిసి తవిశలగూడెం గ్రామశివారులోని కిన్నెరసాని చెక్‌డ్యాం వద్దకు ఈత నేర్చుకోవడానికి వెళ్లాడు. ఈ క్రమంలో స్నేహితులతో కలిసి ఈత కొడుతూ లోతైన ప్రాంతానికి వెళ్లి నీటమునిగాడు.గమనించిన స్నేహితులు వెంటనే అతడిని ఒడ్డుకు చేర్చారు. కానీ అప్పటికే అతడు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సంపత్‌కుమార్ కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాల్వంచ రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

పట్టు'భట్టి' రోడ్డు వేశారు

- చిన్ననాటి కలను నెరవేర్చుకున్న డిప్యూటీ సీఎం
- తాను నడిచిన డొంకదారి బీటీ రోడ్డుగా మార్పు
- స్నానాల లక్ష్మీపురం నుంచి వైరాకు కొత్తరోడ్డు

వైరా, మార్చి 24: తాను చిన్న వయస్సులో నడిచిన డొంకను బీటీ రోడ్డుగా నిర్మించి కలను సాకారం చేసుకున్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. ఆయన చిన్నప్పుడు తమ స్వగ్రామమైన వైరా మండలంలోని స్నానాలలక్ష్మీపురం నుంచి వైరాకు హైస్కూల్ చదువు కోసం పొలాల మధ్యనున్న డొంకనుంచి కాలినడకన వెళ్లేవారు. తాను అనేక ఏళ్లు నడిచిన డొంకను మర్చిపోకుండా ఇప్పుడు ఏకంగా బీటీ రోడ్డును నిర్మించారు. స్నానాల లక్ష్మీపురం నుంచి వైరా వరకు పొలాల మధ్య సుమారు ఐదు కిలోమీటర్ల డొంక ఉండేది. ఆ దారిలోనే భట్టి చిన్నప్పుడు తన స్నేహితులతో కలిసి హైస్కూల్‌కు వచ్చి వెళ్లేవారు. అయితే ఆ డొంకను బీటీ రోడ్డుగా నిర్మించాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రత్యేక చొరవతో భట్టి విక్రమార్క రూ.రెండుకోట్లకుపైగా నిధులను మంజూరు చేయించారు. కానీ నిర్మాణం సాఫీగా సాగలేదు. కానీ గత నవంబరులో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టడంతో ఈ డొంకకు మహర్దశ పట్టింది. ఈ ఏడాది జనవరిలో తొలిసారి స్నానాల లక్ష్మీపురం వచ్చిన భట్టివిక్రమార్క ఈ రోడ్డు నిర్మాణంపై దృష్టిసారించారు. 18 అడుగులతో నిర్మిస్తున్న ఈ రోడ్డును 20అడుగులతో నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఈ రోడ్డు గండగలపాడు గ్రామం నుంచి వైరాకు ఉండటంతో అందుకు ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణంపై భట్టి విక్రమార్క అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూములను రైతుల నుంచి సేకరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు రైతులతో మాట్లాడగా రోడ్డు కోసం తమ భూములు ఇచ్చేందుకు రైతులు మందడపు మధుసూదన్‌రావు, మచ్చామణి తదితర రైతులు అంగీకరించారు. అయితే జాతీయ రహదారికి ఆనుకొని ఖమ్మంలోని ఆసుపత్రి యజమానికి సంబంధించిన భూమి ఉంది. రహదారి పక్కనే ఉన్న ఆ భూమికి మార్కెట్ ధర ఎక్కువగా ఉండడంతో సదరు భూయజమాని 40అడుగుల వెడల్పుతో 150మీటర్ల పొడవున తన భూమిని రోడ్డుకు ఇచ్చేందుకు తటపటాయిస్తున్నారు. ఈ 150మీటర్ల భూమిని సేకరిస్తే గండగలపాడు వెళ్లకుండానే వైరానుంచి నేరుగా స్నానాలలక్ష్మీపురానికి వెళ్లేందుకు అవకాశం ఏర్పడుతుంది.



పొలాల మధ్యలో స్నానాల లక్ష్మీపురానికి కొత్తగా నిర్మించిన బీటీ రోడ్డు, స్థలాన్ని పరిశీలిస్తున్న భట్టి విక్రమార్క(ఫైల్)

శివరాత్రి రోజు తాత్కాలిక రోడ్డు నిర్మాణం

ఈనెల 8న శివరాత్రి సందర్భంగా భట్టి ఆదేశాలతో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సదరు భూ యజమానిని పిలిపించి స్నానాల లక్ష్మీపురం జాతర మూడురోజులపాటు ఆ రైతు భూమినుంచి తాత్కాలిక రోడ్డు వేసేందుకు ఒప్పించారు. భట్టి విక్రమార్క తాను అనుకున్న విధంగా శివరాత్రి రోజు స్నానాలలక్ష్మీపురంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి ఈ తాత్కాలిక రోడ్డు నుంచి కొత్తగా నిర్మించిన బీటీరోడ్డు గుండా రాకపోకలు కొనసాగించారు. అయితే జాతర ముగిసిన తరువాత సదరు భూయజమానికి ఆ తాత్కాలిక రోడ్డును మూసివేశారు. ఆ కొద్దిపాటి భూసేకరణ కూడా పూర్తయితే గండగలపాడు వెళ్లకుండానే నేరుగా వైరా నుంచి స్నానాల లక్ష్మీపురానికి రోడ్డు మార్గం సుగమమవుతుంది.

ధ్వంసమైన పంటకాల్వలను పునర్నిర్మించాలి

» రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు



ధ్వంసమైన పంట కాల్వలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

వైరా, మార్చి 24: గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణాలతో ధ్వంసమవుతున్న పంట కాల్వలను వెంటనే పునర్నిర్మించాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. ఆదివారం వైరా మునిసిపాలిటీ పరిధిలోని సోమవరం రెవెన్యూలో ఉన్న గండగలపాడు సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులతో ధ్వంసమైన పంట కాల్వలను పరిశీలించి మాట్లాడారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులతో పంట పొలాలకు సాగునీరందించే కాల్వలు ధ్వంసం కావడంతో రైతులు రోడ్డు నిర్మాణ సంస్థ ప్రతినిధులను ప్రశ్నించినప్పటికీ సరైన సమాధానం చెప్పకుండా దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారన్నారు. కాగా నిర్మాణ సంస్థ ప్రతినిధులతో ఈ విషయమై మాట్లాడడంతో కాల్వల పునర్నిర్మాణానికి హామీ ఇచ్చారని తెలిపారు. డొంక రోడ్లు ఉన్న ప్రతి చోటా అండర్‌పాస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులు మల్లెంపాటి రామారావు, ఇమ్మడి వీరభద్రం, సుధీర్, మచ్చా మణి, సత్యం, పల్లెబోయిన కృష్ణ, కామినేని రవి, చిత్తారు మురళీ, పుచ్చకాయల రామయ్య, బొల్లెపోగు శ్రీను పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

అశ్వారావుపేట రూరల్, మార్చి 24: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన అశ్వారావుపేట మండలంలో ఆదివారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం రత్నగిరి గ్రామానికి చెందిన బలుసుపాటి అంజిమూర్తి(37) చింతలపుడి మండలంలో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కాగా అశ్వారావుపేటలో ఉన్న తన బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా, రామచంద్రాపురం వెళ్లే మార్గానికి దగ్గరలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చర్ల: వేర్వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందిన సంఘటన చర్ల మండలం రాళ్లగూడెం, ఎదరుగుట్టల వద్ద ఆదివారం జరిగాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా గుండం గ్రామానికి చెందిన మడకం రాజేష్ (35) ఆదివారం చర్ల నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బండి వెనుక కూర్చున్న మరో వ్యక్తికి గాయాలయ్యాయి. అదే విధంగా వాజేడు మండలానికి చెందిన కొంత మంది వ్యక్తులు ఓ ఆటోలో ప్రగళ్లపల్లి గ్రామానికి వెళ్తున్నారు. ఇదే క్రమంలో ఆర్టీసీ బస్సును తప్పించబోయి చర్ల మండలం పర్ణశాల రాళ్లగూడెం వద్ద ఆటో పల్టీ కొట్టింది ఈ ఘటనలో కాజీంబియా (45) అనే మహిళ మృతి చెందింది. మరో ఇద్దరు గాయపడ్డారు.

గుండెపోటుతో విలేకరి...



జగన్నాథరాజు

మణుగూరు: మణుగూరుకు చెందిన విలేకరి మందపాటి జగన్నాథరాజు(48) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. ఇటీవల అనారోగ్యానికి గురైన రాజు హైద్రాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 20ఏళ్లగా విలేకరిగా సేవలు అందించారని పేర్కొన్నారు. జగన్నాథరాజు మృతి పట్ల మణుగూరు ప్రెస్ క్లబ్, సీనియర్ జర్నలిస్టులు పూజారి చందు, విజయ్, పసునూరి రమేష్, సీతారాములు, షాబీర్ పాషా, మయ్య శ్రీను, వెంకన్న, వెంకట్లు, భాస్కర్, సత్యం బాబు, ఎలక్ట్రానిక్ మీడియా రాందాస్, కృష్ణమోహన్, సతీష్, తుంగల రాము, మిత్రులు శ్రీను, ఎంకెఎం రాజు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ యువకుడు..

తల్లాడ: జ్వరంతో బాధపడుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన లక్ష్మీపురం గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తల్లాడ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన బొగ్గుల జితేందర్‌రెడ్డి(27) ఇటీవల జ్వరం రావడంతో స్థానిక ఓ గ్రామీణ వైద్యుడికి వెళ్లి చూపించుకోగా, అతడికి ఇంజక్షన్ వేయడంతో ఒళ్లంతా వాపు వచ్చింది. దీంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి మెరుగుపడకపోవడంతో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి జగన్మోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.కొండల్‌రావు తెలిపారు.

తల్లిని హతమార్చిన తనయుడు

» మద్యం మత్తులో దాడిచేసిన వ్యక్తి

» అనంతరం పోలీసుల ఎదుట లొంగుబాటు

ఖమ్మంక్రైం, మార్చి 24: వేరే వ్యక్తితో సహజీవనం చేస్తోందన్న ఆగ్రహంతో ఓ వ్యక్తి తన తల్లిని కర్రతో కొట్టి హతమార్చిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం ఖమ్మం నగర పరిధిలో జరిగింది. ఖమ్మం అర్బన్ పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని రామన్నపేటకు చెందిన గౌరిశెట్టి రామలక్ష్మి అలియాస్ మీరాబీ (52) అనే దివ్యాంగురాలు ఖమ్మం నగరంలోని దానాయిగూడెంలో నివసిస్తోంది. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆమె కుమారుడు గౌరిశెట్టి శ్రావణ్‌కుమార్ శర్మ హైదరాబాదులోని గాజులరామారంలో ఉన్న వినాయకుడి ఆలయంలో పూజారిగా పని చేస్తున్నాడు. అయితే అతడి తండ్రి 20 ఏళ్ల క్రితం మృతి చెందాడు. ఈక్రమంలో తల్లి ఓ ముస్లిం వ్యక్తితో సహజీవనం చేస్తోంది. అది నచ్చని అతడు పలుమార్లు తల్లితో వాదనకు దిగాడు. ఈ క్రమంలో శనివారం శ్రవణ్‌కుమార్ ఖమ్మం నుంచి హైదరాబాదు వెళ్లే క్రమంలో ఈ విషయంపై తన తల్లితో మరోసారి గొడవ పడ్డాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న అతడు ఆవేశంలో తన చేతికున్న కడియంతో తల్లిని కొట్టాడు. తరువాత పక్కనే ఉన్న కర్రతో కొట్టడంతో ఆమె పడిపోయింది. దీంతో ఆమె చనిపోయిందని నిర్ధారించుకుని ఆదివారం స్థానికంగా ఉన్న ఓ పెద్దమనిషితో ఖమ్మం అర్బన్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయం చెప్పాడు. దీంతో పోలీసులు సంఘటనాస్థలానికి వెళ్లి రామలక్ష్మి మృతదేహాన్ని పరిశీలించి మృతురాలి కుమార్తెకు సమాచారం అందించి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుమార్తెకు అప్పగించారు. లొంగిపోయిన శ్రావణ్‌కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

స్పాట్ బకాయిలు వెంటనే చెల్లించాలి

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 24: పదోతరగతి 2022, 2023 విద్యా సంవత్సరాలలో స్పాట్ విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు వెంటనే స్పాట్ బకాయిలు చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చావా దుర్గాభవాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు నాగమల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు,బుర్రి వెంకన్న, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

'టెట్ పరీక్ష రుసుం తగ్గించాలి'

ఏన్కూరు, మార్చి 24: ఉపాధ్యాయ ప్రవేశపరీక్ష (టెట్) ఫీజును వెంటనే తగ్గించాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొవ్వూరి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఏన్కూరులో విలేకరులతో మాట్లాడుతూ టెట్ ప్రవేశ పరీక్ష ఫీజు గతంలో ఒక పేపర్‌కు రూ.200, రెండు పేపర్లకు రూ300లు ఉండేవని తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వం ఒక పేపర్‌కు రూ.వెయ్యి, రెం డు పేపర్లకు రూ.2వేలు పెంచిందని విమర్శించారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు నల్లబోతుల రమేష్, చింతనబోయిన రాందాస్, మోరేబోయిన కృష్ణ, రెంటపల్లి నారాయణ పాల్గొన్నారు.

ఎండుతున్న వరి పొలాలు..

» దిక్కుతోచని స్థితిలో రైతులు

» పడిపోయిన భూగర్భజలాలు

» ఆదుకోవాలని అన్నదాతల వినతి



నేలకొండపల్లిలో నీళ్లు లేక ఎండిపోయిన పొలం

నేలకొండపల్లి, మార్చి24: సాగునీరు అందక వరి పొలాలు ఎండిపోతున్నాయి. కళ్లెదుటే పొలాలు ఎండుతుంటే పెట్టిన పెట్టుబడులు రావన్న బెంగతో దిగాలు పడిపోతున్నారు. నీళ్లు లేక పొలాలు ఎండిపోతుంటే, ఎండుతున్న వరిని కోసి గేదెలకు వేసుకుంటున్నారు. మండలంలో రైతులు వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. నాట్లు వేసిన నెల రోజుల పాటు బావులు, బోర్ల ద్వారా సరిపోను సాగునీరందటంతో పొలాలు బాగానే ఉన్నాయి. పొలాలు బాగున్నాయన్న ఆశతో అన్నదాతలు వేలల్లో పెట్టుబడులు పెట్టారు. రానురాను భూగర్భజలాలు తగ్గిపోయి బావులు, బోర్లలో నీరు తగ్గిపోవడంతో పొలాలు తడవటం తగ్గిపోయింది. దీంతో వరిపంట చేతికొచ్చేది ప్రశ్నార్థకంగా మారింది. కాల్వల ద్వారా సాగునీరు రాకపోతుందా, పొలాలకు నీరందక పోతుందా, భూగర్భజలాలు పెరగకపోతాయా అన్న ఆశతో ఉన్న రైతులకు సాగర్‌లో నీళ్లు లేకపోవడంతో, అక్కడి నుంచి సాగునీరు వస్తుందన్న ఆశలు అడుగంటిపోయాయి. దీనికి తోడు రోజురోజుకు ఎండలు మండిపోతుండడంతో భూగర్భ జలాలు పూర్తిస్థాయిలో పడిపోయాయి. కాల్వల నుంచి సాగునీరు అందక, బావులు, బోర్లలో నీరు లేక పొలాలు తడవక ఎండటం మొదలైంది. బావులు, బోర్లలో నీరు తగ్గిపోవటంతో నాలుగు ఎకరాలు వరి వేసిన రైతు రెండు ఎకరాలకే నీరు అందించటం మొదలెట్టాడు. అయినప్పటికీ సాగునీరు అందక రైతులు తమ పొలాల్లో ఎండిపోయిన వరిని కోసి గేదెలకు వేసుకోవటం, మేపటం చేసుకుంటున్నారు. మండలంలో ఎంతోమంది ఎండిపోయిన వరి పొలాలను చూసుకుని లబోదిబో మంటున్నారు. ఎండిన వరిని కొందరు పొలంలోకే గెదెలను తోలి మేపుకుటుండగా, మరికొందరు రైతులు కోసుకెళ్లి గేదెలకు వేసుకుంటున్నారు. యాసంగిలో వరి వేసిన రైతుల బాధలు వెలకట్టలేనివి. నీళ్లు లేక పంట నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాను..

● మన్నె కోటేశ్వరరావు, నేలకొండపల్లి



బోరు కింద సాగవుతుందన్న ఆశతో నాలుగు ఎకరాల్లో వరిని సాగుచేశాను. మొదటి నెల రోజులు బోరులో నీరు మొత్తం పొలానికి అందాయి. రానురాను నీరు తగ్గిపోవడంతో బోరు నుంచి రెండు ఎకరాలకే నీరు అందింది. మిగిలిన రెండు ఎకరాలు పూర్తిస్థాయిలో ఎండిపోవడంతో గత్యంతరం లేక ఎండిన వరిని కోసి గేదెలకు వేసుకుంటున్నాను.

నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు

● డీఈవో సోమశేఖరశర్మ

కూసుమంచి, మార్చి 24: పదో తరగతి పరీక్షల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే ఏమాత్రం ఉపేక్షించేది లేదని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ తెలిపారు. కూసుమంచి ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన గణితం పరీక్షలో కొందరు పరీక్షలకు ఆటం కం కల్పించడంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. పరీక్ష నిర్వహణకు ఆటంకాలు కలిగించిన ఏడుగురిపై ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. మాల్ ప్రాక్టీస్ వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కూసుమంచి పరీక్షాకేంద్రం సీఎస్ వెంకటరెడ్డి తదితరులున్నారు

టెన్త్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు యత్నించిన ఏడుగురిపై కేసు...

కూసుమంచి, మార్చి 24: ఖమ్మం జిల్లా కూసుమంచిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు యత్నించిన ఏడుగురిపై ఖమ్మం డీఈవో సోమశేఖరశర్మ ఆదేశాలతో పరీక్షాకేంద్రం ఛీఫ్ సూపరిండెంట్ ఫిర్యాదు మేరకు కూసుమంచి పోలీసులు కేసు నమోదు చేశారు. కూసుమంచి ఉన్నత పాఠశాలలో టెన్త్ పరీక్షల్లో భాగంగా శనివారం గణితం పరీక్ష సందర్భంగా కొందరు విద్యార్థులకు చెందిన వ్యక్తులు అక్రమంగా పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించి చిట్టీలు అందించేందుకు ప్రయత్నించారు. దాంతో పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్ ఫిర్యాదు మేరకు ఏడుగురుపై కూసుమంచి పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు నమోదైనవారిలో కూసుమంచి మండలం బికారితండాకు చెందిన తేజావత్ రిషీ అర్వింద్, ప్రగతి స్కూల్ టీచర్ మంగూలాల్, పోచారం గ్రామానికి చెందిన రెడ్డిమళ్ల గణేష్, ఇంతియాజ్, ఎర్షాద్ అహ్మద్, కొక్కిరేణి సీతారాములుతో పాటు ఓ మైనర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాటం చేయాలి

» మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి రంగారావు



సమావేశంలో మాట్లాడుతున్న రంగారావు

రఘునాథపాలెం, మార్చి 24: బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా 23ఏళ్ల పాటు భగత్‌సింగ్ పోరాటాలు చేసి బలిదానానికి గురయ్యారని, దేశంలో పెను సవాల్‌గా మారిన మతోన్మాదంపై భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాటాలు చేయాల్సిన అవశ్యకత ఏర్పడిందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ 93వ వర్ధంతి వారోత్సవాల సందర్భంగా పీవైఎల్, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని రాంక్యాతండాలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ భగత్‌సింగ్ ఆశయాలను యువతీ, యువకులు వారసత్వంగా పుణికి పుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. నేడు దేశంలో మతం పేరుతో బీజేపీ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. మతాన్ని ఒక ఎన్నికల ఆయుధంగా చేసుకొని, మెజార్టీ ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రధాన మంత్రి ప్రయత్నం చేస్తున్నారన్నారు. అటువంటి రాజకీయ విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పర్చాలని కోరారు. భారత దేశ రాజ్యాంగం ప్రకారం అన్ని మతాలకు సమాన హక్కులు, గౌరవం కల్పించిందన్నారు. బీజేపీ ప్రభుత్వం మాత్రం మతాల పేరుతో ప్రజల మధ్య విభజన ఏర్పాటు చేసి దేవుడు, గుడిని సాధనంగా చేసుకొని రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఓట్లు దండుకుందామని ప్రచారం చేస్తోందని విమర్శించారు. బీజేపీ మతోన్మాద విధానాలను ఎన్నికల కమిషన్ కూడా అడ్డుకోకపోవడం విచారకమరమన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో మైనార్టీలపై దాడులు పెరిగాయని, చర్చీలు, మసీదులు ధ్వంసం చేశారని ఆరోపించారు. రామాలయం నిర్మాణం పూర్తికాకుండానే ఎన్నికల కోసం ప్రారంభించారని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన విజేతలకు జేవీడీ సంస్థ నిర్వాహకులు రాంబాబు, సైదులు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ కార్యదర్శి గోకినెపల్లి వెంకటేశ్వరరావు, రామయ్య ఆవుల అశోక్, శిరోమణి, ఝాన్సీ, శ్రీనివాస్, దేవ్లా, లక్ష్మణ్, లక్ష్మణ్, పాపారావు, రాకేస్, ప్రేమ్‌సింగ్, ఇస్లావత్ స్వాతి, రమేశ్, సునీల్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు గణేష్ ఎంపిక



ఖమ్మం స్పోర్ట్స్, మార్చి 24: బీహార్ రాష్ట్రంలో ఈనెల 31 నుంచి ఏప్రిల్ 4 వరకు జరగనున్న 52వ జాతీయ స్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్ బాల్ పోటీలకు ఖమ్మం జిల్లాలోని పెనుబల్లి మండలం టేకులపల్లి గ్రామానికి చెందిన సీహెచ్. గణేష్ ఎంపికయ్యాడు. గణేష్ ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ బాధ్యులు తెలిపారు తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ పోటీలకు ఎంపికైన గణేష్‌ను హ్యాండ్‌బాల్ సంఘ సభ్య లు అభినందించారు. జాతీయ పోటీలలో సైతం రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

వైభవంగా గరుడపటాధివాసం



గరుడపటాధివాసం నిర్వహిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి, మార్చి 24: మండల పరిధిలోని బాలాజీ ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం గరుడ పటాధివాసం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వస్తి వాచకం, ధ్వజారోహణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భేరిపూజా, దేవతాహ్వానం, పారాయణాదులు, హవనం, బలిహరణం లాంటి కార్యక్రమాలను జరిపించారు. సోమవారం రాత్రి వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణ మహోత్సవం జరపనున్నట్లు ఆలయ మేనేజర్ పాకాల వెంకట రమణ తెలిపారు.

నాలుగు వాహనాల సీజ్

మధిరటౌన్, మార్చి24: నెంబర్ లేకుండా తిరుగుతున్న నాలుగు వాహనాలను సీజ్ చేసినట్లు మధిరటౌన్ ఎస్ఐ సంధ్య తెలిపారు. ఆదివారం మధిరలో వాహన తనిఖీలు నిర్వహించగా నెంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న పలు వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కారేపల్లిలో వాహనాల తనిఖీ ....

కారేపల్లి, మార్చి24: మండల పరిధిలోని కారేపల్లి క్రాస్ రోడ్డులో ఆదివారం అధికారులు పోలీసు సిబ్బందితో కలిసి పలువాహనాలను విస్తృతంగా తనిఖీ నిర్వహించారు. ఖమ్మం-ఇల్లెందు ప్రధాన రహదారిలో గల కారేపల్లి క్రాస్‌రోడ్డులో కారేపల్లి, కామేపల్లి మండలాలకు సంబంధించి పోలీసు చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. తనిఖీ అధికారుల తోపాటుగా స్పెషల్ స్క్వాడ్ అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. రూ.50వేలకంటే అధికంగా నగదు తీసుకవెళ్లితే వారి వాహనాలను సీజ్ చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

హోలీ సందర్భంగా కమిషనరేట్ పరిధిలో ఆంక్షలు

ఖమ్మంక్రైం, మార్చి 24: హోలీ పండుగ సందర్భంగా ఖమ్మం కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ ఆంక్షలు విధించినట్టు పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినా, ఇతరులకు ఇబ్బంది కలిగించినా చర్యలు తప్పవని పేర్కొన్నారు. పరిచయం లేని వ్యక్తులపై రంగులు చల్లడం వంటివి చేయవద్దని సూచించారు. ఈ ఆంక్షలు మంగళవారం ఉదయం ఆరుగంటల వరకు ఉంటాయని తెలిపారు. అదేవిధంగా మద్యం దుకాణాలు, కల్లు కాంపౌండ్లు, బార్లు అటాచ్‌మెంట్ రెస్టారెంట్లు మూసివేయాలని పేర్కొన్నారు.

అన్యమత ప్రచారాన్ని అడ్డుకున్న గ్రామస్థులు

దుమ్ముగూడెం మార్చి 24:భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ సమీప గ్రామాల్లో ఆదివారం రాత్రి అన్యమత ప్రచారాన్ని గ్రామస్థులు అడ్డుకున్నారు. తేగడకు చెందిన కొందరు వ్యక్తులు ఆదివారం రాత్రి గోవిందాపురం గ్రామంలో అభ్యంతరకరంగా ప్రచారాన్ని ఎందుకు నిర్వహిస్తున్నారంటూ పర్ణశాల ఎంపీటీసీ తెల్లం భీమరాజుతో సహా గోవిందాపురం, పీరాయిగూడెం గ్రామస్థులు వారిని నిలదీశారు. ఈ విషయమై పోలీసులకు సైతం గ్రామస్థులు ఫోనులో ఫిర్యాదు చేశారు. పోలీసుల సూచనల మేరకు వారిని వదిలేశారు.

సారపాకలో చోరీ

బూర్గంపాడు, మార్చి 24: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన సారపాకలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకకు చెందిన సుమన్ కుమార్ మిశ్రా అనే వ్యక్తి ఓ ట్రాన్స్‌పోర్ట్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. అతని భార్య మీసా కుమారి అనారోగ్యంగా ఉండడంతో ఈ నెల 23న ఇంటికి తాళం వేసి భద్రాచలంలోని ఆసుపత్రికి వెళ్లి చికిత్స అనంతరం బంధువుల ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం తన ఇంటి చుట్టు పక్కల వారు ఇంటి తాళం పగల కొట్టి ఉండడం గమనించి అతడికి సమాచారం అందించారు. దీంతో ఇంటికి చేరుకున్న దంపతులు చోరీ జరిగినట్లు గుర్తించి, ఇంట్లో ఉన్న రూ.70వేల నగదు, ఐదు తులాల బంగారం ఆభరణాలు దొంగిలించినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రమశిక్షణ, ఐక్యతతో అందరిని కలుపుకుపోదాం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం

సత్తుపల్లిరూరల్, మార్చి24: క్రమశిక్షణ, ఐక్యతతో అందరిని కలుపుకుని పోవాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం అన్నారు. ఆదివారం నియోజకవర్గ కేంద్రం సత్తుపల్లిలో నిర్వహించిన టీడీపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంపీ అభ్యర్థిపై వచ్చేవారంలో స్పష్టత వస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణ ఎన్నికల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆశీర్వాదం ఉంటేనే ఏ పార్టీ అభ్యర్థి అయినా గెలుస్తారని ఆంధ్రాలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కొలికపూడి శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు మందలపు రజిని, నాయకులు పొట్రు వెంకట రామారావు, సరస్వతి, తిమ్మిడి రాంబాబు, రమ్య, వినుకొండ రమేష్, బొంతు భాస్కరరావు, విజయలక్ష్మీ, కాకర్ల రంగారావు, తుమ్మలపల్లి రాజేశ్వరరావు, మల్లూరి మోహన్, రాచర్ల చంద్రశేఖర్, ఉండవల్లి శ్రీకాంత్, కొంగల చెన్నకేశవ, గుత్తా వెంకటేశ్వరరావు, చల్లగుళ్ల అప్పారావు పాల్గొన్నారు.



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

» సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు

ఖమ్మం రూరల్, మార్చి 24: ప్రజల పక్షాన నిత్యం పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌లు అన్నారు. మండల పరిధిలోని ఏదాలాపురంలో జనవరిలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని దండి భాస్కర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రోల్ బాండ్ల విరాళాల సేకరణతో బూర్జువా పార్టీల వ్యవహారం బట్టబయలైందన్నారు. అధికారంలో ఉండి కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసినందుకు గాను బాండ్ల రూపేనా అవినీతి సొమ్మును పొందారని ఆరోపించారు. అనంతరం భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా గ్రామంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో యువకులు కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, చిన్న వెంకటరెడ్డి, శేషగిరి, పెద్ద వెంకటరెడ్డి, సురేందర్, దండి రంగారావు, భాస్కర్, వెంకన్న, రాము, ఉపేందర్, సాయి, శ్రీను, గురవయ్య, రాము, గోపి పాల్గొన్నారు.



కాగడాల ప్రదర్శన చేస్తున్న యువకులు

ఎదురు కాల్పుల్లో మావోయిస్టు మృతి



ఎన్‌కౌంటర్ ప్రాంతంలో లభించిన మావోయిస్టు మృతదేహం, తుపాకీ, సామగ్రి

చర్ల, మార్చి 24: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా కొండపల్లి అడవుల్లో జరిగిన ఎదురు కాల్పుల్లో మావోయిస్టు మృతి చెందినట్లు సుకుమా జిల్లా పోలీసులు తెలిపారు. జేగురుకొండ అడవుల్లో మావోయిస్టులు ఉన్నట్లు సుకుమా జిల్లా పోలీసులకు సమాచారం అందింది. దీంతో డీఆర్‌జీ, కోబ్రా, బస్తర్ ఫైటర్స్ బలగాలు గాలింపు చేపట్టాయి. ఇదే క్రమంలో కొండపల్లి అడవులకు ప్రత్యేక బలగాలు చేరుకోగానే మావోయిస్టులు, బలగాలకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. అనంతరం ఆ ప్రాంతాన్ని గాలించగా ఒక మావోయిస్టు మృతదేహంతో పాటు నిత్యావసర వస్తువులు, ఒక తుపాకీ, పుస్తకాలు, మావోయిస్టులు ఫొటోలు, ప్రింటర్, మందులు, సిరంజీలు, ఇతర వస్తువులను బలగాలు లభించాయి. మృతి చెందిన మావోయిస్టు ఆలం పొడియా (25)గా గుర్తించారు. అతడు గంగలూరు ఏరియా కమిటీ సభ్యుడని సుకుమా పోలీసులు తెలిపారు.

20 కేజీల గంజాయి పట్టివేత

భద్రాచలం, మార్చి 24: భద్రాచలంలో ఆదివారం రూ.5,24,750 విలువైన 20.990 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. కూనవరం చెక్ పోస్ట్ వద్ద ఎస్ఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది వాహనాలు తనిఖీలు చేస్తుండగా, ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి జిల్లాకు చెందిన సాగర్ మండల్, నిరోద్ సర్దార్ అనే వ్యక్తులు తమ వాహనంలో వెళ్తుండగా తనిఖీ కోసం ఆగాలని పోలీసులు ప్రయత్నించగా, ఆపకుండా వెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో అనుమానం వచ్చి వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో గంజాయి ఉన్నట్లుగా గుర్తించారు. తాము ఇద్దరం జల్సాలకు అలవాటు పడి మా గ్రామానికి చెందిన బికాస్ కుమార్ రాయ్ అనే వ్యక్తి వాహనంలో గంజాయి వ్యాపారి ఆశిష్ బిస్వాస్ ఆదేశాల మేరకు గంజాయిని అక్రమ రవాణా చేస్తున్నట్లు తమ విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద నుంచి 20.990 కిలోల గంజాయి, వాహనం, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవరావు తెలిపారు.

మనోధైర్యంతో లక్ష్యాలు సాధించాలి: ఏసీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేష్

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 24: ప్రణాళిక, మనోధైర్యంతో ఉన్నత లక్ష్యాలు సాధించవచ్చని స్పెషల్‌బ్రాంచ్ ఏసీపీ వెంకటేష్ అన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలోని కాకతీయ యూనివర్శిటీ పీజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యాక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. వ్యాయామ విద్యతో ఉపాధి అవకాశాలు ఎన్నో ఉన్నాయన్నారు. డ్రగ్స్ మత్తు పదార్థాలకు విద్యార్థులు బానిసలు కాకుండా ఉత్తమ మార్గాన్ని ఎంచుకోని సమాజంలో తమకంటూ ఒక ప్రత్యేక స్థానం సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చేకూరి రవికుమార్, అథ్లెటిక్ చీఫ్ కోచ్ గౌస్, అధ్యాపకులు మధు, కోటి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 24: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఆదివారం 48వ డివిజన్‌లో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. టీపీసీసీ సభ్యులు ఎండీ జావీద్, మైనార్టీ డిపార్టుమెంట్ జిల్లా అధ్యక్షులు హుస్సెన్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ గౌస్, నగర మైనార్టీ అధ్యక్షుడు అబ్బాస్, బొజెడ్ల సత్యనారాయణలు పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

తల్లాడ పీహెచ్‌సీకి అవార్డులు



అవార్డు అందుకుంటున్న అరుణ

తల్లాడ, మార్చి 24: క్షయవ్యాధి నిర్మూలనలో మెరుగైన సేవలందించినందుకుగానూ తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టీబీ ట్రీట్‌మెంట్ యూనిట్‌కు అవార్డులు దక్కాయి. ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆదివారం ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ల్యాబ్‌టెక్నీషియన్‌గా ధనకొండ కృష్ణారావు, కుర్నవల్లి ఉపకేంద్రం ఏఎన్ఎం ఆర్.సునీతలకు డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతీ, టీబీ నిర్మూలన జిల్లా అధికారి డాక్టర్ వి.సుబ్బారావు అవార్డులు ప్రధానం చేశారు. అవార్డులందుకున్న కృష్ణారావు, సునీతలను మండల వైద్యాధికారి డాక్టర్ ఐ.రత్నమనోహర్, సీహెచ్‌వో భాస్కర్, సూపర్‌వైజర్లు కె.పెద్దపుల్లయ్య, వైసు రేష్, సిబ్బంది అభినందించారు.



అవార్డు అందుకుంటున్న కృష్ణారావు

ఉత్తమసేవలకు గుర్తింపు

కొణిజర్ల, మార్చి 24: మండల స్థాయిలో క్షయ వ్యాధి గ్రస్తులకు ఉత్తమ సేవలను అందిస్తున్నందుకు గాను కొణిజర్ల మండలం లాలాపురం గ్రామ ఆశా కార్యకర్త కోపెల అరుణ ఉత్తమసేవ పురస్కారాన్ని ఆదివారం డీఎంహెచ్‌వో మాలతి నుంచి అందుకుంది. గ్రామంలో క్షయ వ్యాధిపై పూర్తిస్థాయిలో చికిత్స తీసుకునేవరకు రోగుల వెంటనే ఉండటం, ఇళ్లలో కుటుంబ సభ్యులకు పరీక్షలు చేయించడం, అనుమానం ఉన్న వారికి టీబీ పరీక్షలు నిర్వహించడం వంటి సేవలను అందించడంలో ఆమె తనదైన ముద్ర వేసుకుంది. ఉత్తమసేవ పురస్కారాన్ని ఆమెను పలువురు అభినందించారు.

పూటీ పందెంలో ఖమ్మం ఎడ్లకు ప్రథమ స్థానం

» ద్వితీయ స్థానం లో నిలిచిన ఏపీ ఎడ్లు



ప్రథమ స్థానం దక్కించుకున్న ఖమ్మం ఎడ్ల జత

ఎర్రుపాలెం, మార్చి 24: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో శ్రీ అంకమ్మ తల్లి అక్కమ్మ పేరంటాల రామలింగేశ్వరస్వామి తిరువాళ్ల సందర్భంగా రెండు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించన ఎడ్ల పూటీ పందాలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీలో 20 జతల ఎడ్లు పోటీల్లో పాల్గొన్నాయి. నిర్దేశించిన 10నిమిషాల వ్యవధిలో పూటీలను లాగిన దూరాన్ని బట్టి విజేతలను నిర్ణయించారు. ఖమ్మం జిల్లా బనిగండ్లపాడు గ్రామానికి చెందిన తల్లపురెడ్డి అంకాల్‌రెడ్డి ఎడ్లు 2,601 అడుగులు లాగి ప్రథమ బహుమతిని, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల గ్రామానికి చెందిన షేక్ హజ్మీయ ఎడ్లు 2,285 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతిని, ఖమ్మం జిల్లా బనిగండ్లపాడు గ్రామానికిచెందిన తల్లపురెడ్డి రామిరెడ్డి ఎడ్లు 2,229 అడుగుల దూరం లాగి తృతీయ బహుమతి గెలుపొందాయి. మొదటి బహుమతిగా రూ.30వేలు, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ. 25వేలు, రూ. 20వేలను నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, దాతలు వీఎస్‌కే ప్రాజెక్ట్ అధినేత వేజండ్ల సాయికుమార్, యన్నం సత్యనారాయణరెడ్డి, నీలం రవికుమార్, శీలం నరేందర్‌రెడ్డి, బిందెల వెంకటనారాయణ, యరమల శ్రీనివాస్ రెడ్డి, సలాం, శీలం అక్కిరెడ్డి, ఆలయ పూజారి వేమిరెడ్డి వెంకటరెడ్డి, కాశావరుల నరసింహామూర్తి పాల్గొన్నారు.

జంట తండాల్లో జోడు సంబురాలు

» లోక్యా, జగమాల్ తండాల్లో హోలీ సంబురాలు

» మూడు రోజుల పాటు వేడుకలు



లోక్యాతండలో వేడుకల్లో తండావాసులు

కూసుమంచి, మార్చి 24: లోక్యాతండ, జగమాల్‌తండాలో హోలీ సంబురాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు ఘనంగా జరుగుతాయి. సాధారణంగా ప్రతిగ్రామంలో ఒక్కరోజు మాత్రమే జరుపుకొనే ఈపండుగను ఇక్కడ మాత్రం ఒక ప్రత్యేకగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. హోలీని పురస్కరించుకుని వివిధ గ్రామాలను పెద్దఎత్తున బంధువులు, కుటుంబసభ్యులు ఇక్కడకు చేరుకున్నారు. దీనిలో భాగంగా సాయంత్రం పెద్దఎత్తున కోలాటం వేడుకను జరుపుకొన్నారు. చిన్నపెద్ద తారతమ్యం లేకుండా అందరు కలిసి కోలాట వేడుకల్లో పాల్గొన్నారు. దీంతో తండాలో కోలాహాలం నెలకొంది. ఒకరినొకరు పట్టుకుని వలయాకారంలో కర్రలతో నృత్యాలు చేసుకుంటు గిరిజన సంప్రదాయ పాటలు పాడారు. సుమారు రెండుగంటలకు పైగా కోలాటం ఆడటం విశేషం. ఈ వేడుకలో ఎంపీటీసీ సభ్యుడు జర్పుల బాలాజీనాయక్, గ్రామపెద్దలు రామచంద్రునాయక్, వడిత్య సేట్‌రామ్ నాయక్, గేరియా సావ పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల్లో ఉంటూ ఉన్నత ఉద్యోగాలు చేసేవారు సైతం హోలీ సందర్భంగా స్వగ్రామం లోక్యాతండ చేరుకుని వేడుకల్లో పాల్గొని ఆడిపాడటం విశేషం.



విద్యార్థులతో రంగస్థల దర్శకుడు శ్రీనివాస్ దెంచనాల

'ప్రియదర్శిని'లో రంగ శిక్షణ

» 50మంది బీటెక్, డిగ్రీ విద్యార్థులకు అవగాహన

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 24: నాలుగు దశాబ్దాలుగా ఆధునిక నాటకాలు దేశమంతటా తెలుగులో ప్రదర్శిస్తున్న 'జనపదం థియేటర్ రిపర్టరి' ఆధ్వర్యంలో శనివారం ఖమ్మం రూరల్ మండలం పెద్దతండలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో 50మంది విద్యార్థులకు రంగశిక్షణ శిబిరం నిర్వహించారు. ప్రఖ్యాత కవి ప్రముఖ రంగస్థల దర్శకుడు శ్రీనివాస్ దెంచనాల ఈ శిబిరం నిర్వహించారు. బీటెక్, డిగ్రీ విద్యార్థులకు థియేటర్‌ను ఏవిధంగా వారు వ్యక్తిత్వ వికాసానికి, అకడమిక్ అభివృద్ధికి, సామాజిక స్పృహ చింతనకు ఉపయోగించుకోవచ్చునో రకరకాల థియేటర్ గేమ్స్ ద్వారా, ఇంప్రవైజేషన్స్ ద్వారా, మోనో లాగ్స్ ద్వారా, సోలో ప్రదర్శనల, స్టోరీ నారేషన్స్ ద్వారా శిక్షణ ఇచ్చారు. నటీనటులకు ఒక్క శరీర సౌందర్యం ఉంటే సరిపోదని, గొప్ప నటన ప్రదర్శనకు నటీనటులు తమ దేహాన్ని హృదయాన్ని మెదడును సృజనాత్మకంగా ఉపయోగించాల్సి ఉంటుందని శ్రీనివాస్ నిరూపించారు. కేవలం విద్యార్థుల కోసం తాను డిజైన్ చేసి కొన్ని వేల మందిని అటు నటనలోనూ ఇటు చదువుల్లోనూ శక్తివంతులుగా తయారు కావడం కోసం అంతర్నాటకం అనే కాన్సెప్ట్ పై అవగాహన కలిగించారు. విద్యార్థులు శిబిరం ముగింపులో నేర్చుకున్న అంశాలను వాడుకొని వాళ్లకి వాళ్లే విభిన్న సంఘటనలు, కథలు ఆధారంగా సృజించిన మూడు లఘు నాటకాలు ప్రదర్శించారు.

కళాశాల అధ్యాపక బృందం, స్టాఫ్, యాజమాన్యం ఈ నాటకాలు వీక్షించి నటీ నటులను, శ్రీనివాస్‌ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్, ప్రముఖ కవి మువ్వ శ్రీనివాస్ రావు డైరెక్టర్ వెంకటరమణ, ప్రిన్సిపాల్ బి. గోపాల్, శ్రీనివాస్ దెంచనాలను ఘనంగా సన్మానించారు.

పెట్టుబడులు భారం.. దిగుబడులు ఘోరం



» మిర్చి రైతుల దీనస్థితి

ఏన్కూరు, మార్చి 24: రైతులు ఎన్నో ఆశలతో సాగు చేసిన మిర్చి పంట ఈసారి నష్టాలను మిగిల్చింది. రెండేళ్ల నుంచి కూడా ధర ఆశాజనకంగా ఉండడంతో ఏన్కూరు మండలంలో రైతులు సాగు విస్తీర్ణం పెంచారు. ఈ ఏడాది సుమారు పదివేల ఎకరాల్లో సాగు చేశారు. మండలంలోని ఏన్కూరు, టీఎల్‌పేట, కేసుపల్లి, జన్నారం, నాచారం, తిమ్మరావుపేట, బురదరాఘవాపురం, రేపల్లెవాడ, హిమామ్‌నగర్, రాజులపాలెం, రాయమాదారం తదితర ప్రాంతాల్లో సాగు చేశారు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తే కొన్ని ప్రాంతాల్లో రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి వచ్చిన పరిస్థితి లేదు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల పంటలను తీవ్రంగా దెబ్బతీశాయి. నల్లతామర ఇతర రకాల తెగుళ్ల దిగుబడిపై ప్రభావం చూపాయి.

మండలంలోని నాచారం, హిమామ్‌నగర్, రేపల్లెవాడ, మేడేపల్లి, బద్రుతండా, రామాతండా, రాజులపాలెం గ్రామాల్లో పంట బాగా దెబ్బతిన్నది. 80 శాతం మంది రైతులు పెద్ద ఎత్తుననష్టపోయారు. చేతికొచ్చిన పంట అమ్ముకుందామనుకుంటే మార్కెట్‌లో సరైన ధర లభించడంలేదు. గ్రామాల్లో దళారులు క్వింటా రూ.15నుండి 16వేలకు అడుగుతున్నారు. మరోవైపు కూలీల కొరత కూడా తీవ్రంగా ఉంది. రైతులు అనేక వ్యయప్రయాసలకు ఓర్చి ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి కూలీలను రప్పించి ఏరిస్తున్నారు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని పంట సాగు చేసినప్పటికి పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎకరానికి సుమారు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారు.



కల్లాల్లో ఆరబోసిన మిర్చి



దిగుబడి బాగా తగ్గింది..

ఎ. నర్సింహారావు, వ్యవసాయధికారి

ఈ ఏడాది మిర్చి పంట దిగుబడి బాగా తగ్గింది. ముందస్తుగా సాగు చేయడం, వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం , నల్లనల్లి తెగుళ్ల దాడి వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. నాచారం, రేపల్లెవాడ, మేడేపల్లి, భద్రతండా, రామతండా, రాజులపాలెం, హిమామ్‌నగర్ గ్రామాల్లో రైతులు బాగా నష్టపోయారు.



పెట్టుబడులు కూడా రాలేదు

ధరావత్ రాములు, భగవాన్‌నాయక్‌తండా

ఐదు ఎకరాల్లో మిర్చి సాగు చేశా. నాలుగు లక్షల పెట్టుబడి అయింది. దుక్కులకు రూ.70వేలు కూలీలకు రూ.లక్ష, కోత కూలీలకు రూ.5వేలు, లక్షా80వేలు మందులకు పెట్టుబడి పెట్టారు. దానిని అమ్మగా కేవలం రూ.లక్ష 50వేలు వచ్చాయి. వడ్డీకి తెచ్చినా అప్పులు ఎలా తీరుతాయో అర్థం కావడంలేదు.

ప్రముఖుల హోలీ శుభాకాంక్షలు..



హోలీ పండుగ ఆనందంగా జరుపుకోవాలి

రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హోలీ పండుగను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలి. రంగుల పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోష రంగుల కాంతులు నిండాలి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సహృద్భావ వాతావరణంలో పండుగను జరుపుకోవాలి.



సహజ సిద్ధమైన రంగులనే వాడాలి

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

ప్రజలందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు. ప్రజలందరు పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలి. సహజ సిద్ధమైన రంగులు వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. యువకులు అత్యుత్సాహం ప్రదర్శించి సమస్యలు తెచ్చుకోవద్దు. మహిళల పట్ల మర్యాదగా నడుచుకోవాలి. పోలీసులు సూచించిన నిబంధనలు పాటించాలి.



జీవితాల్లో ఆనందాన్ని నింపాలి

భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

ఈ హోలీ పండుగ ప్రజలందరి జీవితాల్లో సరికొత్త రంగులతో ఆనందాన్ని నింపాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నా. ప్రతీఒక్కరు హోలీ పండుగను కుటుంబసభ్యులతో ప్రశాంత వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలి. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులను ఆదేశించాం.



పర్యావరణహితంగా జరుపుకోండి..

సింగరేణి సీఎండీ బలరాం

రంగుల పండుగ హోలీని సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు ఉత్సాహంగా, ఉల్లాసంగా జరుపుకోవాలి. ఈ పండుగ అందరి జీవితాల్లోను ఆనందాన్ని నింపాలి. సహజసిద్ధమైన రంగులతో పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి.

-కొత్తగూడెం/ ఖమ్మం సాంస్కృతికం

కన్నులపండువగా కల్యాణం

» వైభవంగా మోక్ష వెంకటేశుని పరిణయం

పాల్వంచ టౌన్, మార్చి 24: పాల్వంచ పట్టణ పరిధి గుడిపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత, శ్రీ మోక్ష వెంకటేశ్వరస్వామి కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రధాన అర్చకులు కిషోర్, అనిల్ శాస్త్రి, వాడె చంటిబాబు ఆధ్వర్యంలో స్వామివారికి తెల్లవారునుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస రావు, దమ్మపేట జడ్పీటీసీ సభ్యుడు పైడి వెంకటేశ్వర్లు, శ్యామల గోపాలన్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ చైర్మన్ నల్ల సురేష్ రెడ్డి, పలువురు పట్టణ ప్రముఖులు హాజరై ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కాగా స్వామివారి కల్యాణానికి నల్లి సురేష్ రెడ్డి దంపతులతోపాటు పెద్దమ్మగుడి నుంచి పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. ఆలయకమిటీ అధ్యక్షుడు ఆరెం ప్రశాంత్, కారం రమేష్, రావుల కృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. కోలాటం మాస్టారు శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో వారి బృందం భక్తిపాటలకు ప్రదర్శించిన కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఽ

నేడు లిక్కర్ కిక్కుకు బ్రేక్

» అల్లర్లు జరగకుండా ఖమ్మం సీపీ చర్యలు

» ఖమ్మం జిల్లాలో వైన్స్ మూసివేతకు ఆదేశాలు

» భద్రాద్రి జిల్లాలో యథావిధిగా అమ్మకాలు

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 24: గతంలో ఎన్నడు లేనివిధంగా హోలీ పండుగ రోజు మద్యం దుకాణాలు మూతపడ్డాయి. లోకసభ ఎన్నికలతో పాటుగా హోలీ రోజు ఎటువంటి అల్లర్లు, అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఖమ్మం పోలీసు కమిషనర్ నుంచి ఎక్సైజ్‌శాఖకు ఆదేశాలు రావటంతో ఆదివారం రాత్రి నుంచి సోమవారం రాత్రి వరకు ఖమ్మం జిల్లాలో మద్యం దుకాణాలను బంద్ చేశారు. అయితే హైదరాబాద్ తర్వాత ఖమ్మం జిల్లాలోనే హోలీ రోజు మద్యం దుకాణాలు బంద్ ఆదేశాలు అమలు చేశారు. అయితే ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్‌శాఖ ఖమ్మం డిప్యూటీ కమిషనర్ పరిధిలో ఉంటుంది. ఈ రెండు జిల్లాలకు ఒకే విధమైన ఆదేశాలను అమలవుతాయి. అయితే హోలీ సందర్భంగా ఖమ్మం జిల్లా పరిధిలోని 7 ఎక్సైజ్‌స్టేషన్ల పరిధిలోని 122మద్యం దుకాణాల బంద్‌కు మాత్రమే ఆదేశాలు ఇచ్చారు. కానీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 8 ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని 88 మద్యం దుకాణాల్లో మాత్రం యథావిధిగా అమ్మకాలు జరగనున్నాయి.



మూసివేసిన మద్యం దుకాణం

పోలీసు కమిషనర్ ఆదేశాలతో వైన్స్‌కు సెలవు

జనార్ధన్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్

ఖమ్మం జిల్లాలో హోలీ సందర్భంగా వైన్స్ దుకాణాలకు సెలవు ప్రకటించాం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మద్యం అమ్మకాలు కొనసాగుతాయి. ఖమ్మం జిల్లాలో వైన్స్‌కు సెలవు ఇవ్వాలని పోలీసు కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. అందుకే మద్యం దుకాణాలను బంద్ చేయించాం.



కేరళ డ్రమ్ము వాద్యాలు నగరంలో శుభ కార్యాలకు ప్రత్యేక ఆకర్షణగా మారుతున్నాయి. మళయాళీ సంప్రదాయ వస్త్రధారణతో ప్రదర్శనల ఏర్పాటు చేయటం ఇటీవల అలవాటుగా మారింది. పది నుంచి పన్నెండు మంది సభ్యులు తెల్ల లుంగీ, టవల్ ధరించి, మహిళలు తెల్ల చీరెలు ధరించి సంగీతాన్ని ప్రదర్శిస్తున్నారు. అలుపులేకుండా గంటల పాటు లయబద్ధంగా డ్రమ్ములను మోగిస్తూ సంగీత ప్రవాహాన్ని ఉరకలెత్తిస్తున్నారు. గతంలో ఈతరహా శుభకార్యాలకు సన్నాయి డోలు వంటి స్థానిక శాస్త్రీయ సంగీతాన్ని ఏర్పాటు చేసేవారు... కాగా ఆ స్థానాన్ని కేరళ వాద్యం ఆక్రమించింది.

-ఖమ్మం సాంస్కృతికం

నేడు లక్ష్మీ నృసింహుడి కల్యాణం



అమ్మవార్ల సమేత నృసింహస్వామి

కరకగూడెం, మార్చి 24: కరకగూడెం మండలంలోని బుర్థారం గ్రామం పరిధిలో సుమారు 7 కి.మీ. దూరంలోని కారడవిలోని పెద్దగుట్టపై సువర్ణగిరి జ్వాలాలక్ష్మి నరసింహా స్వామి ఆలయం కొలువుదీరింది. సోమవారం స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు. జగన్మాతలైన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మితో కన్నులపండుగగా స్వామి పరిణయం జరుగనుంది. 26వతేదీన నిత్యహోమం, గరుడ సేవ, ఊరేగింపు నిర్వహిస్తారు. 27న నిత్యహోమం, 28న అంబహోమం నిర్వహిస్తారు. 29న మంగళస్నానం, తెప్పోత్సవం, 30న వసంతోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను ఆలయ పూజారి రవితేజ అందజేస్తారు. స్వామి కల్యాణానికి పోలెబోయిన వంశీయులు, ఆలయ దర్మకర్త పోలెబోయిన పోలెబోయిన రవితేజ అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

శ్రీరామ నవమి పనులు ప్రారంభం

» మిథిలా కల్యాణ మండపానికి పంచరంగులు

» నేటి నుంచి ఆన్‌లైన్‌లో కల్యాణం, పట్టాభిషేకం టికెట్లు

» ఒకటి నుంచి ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయం



సెక్టార్ల రైలింగ్‌కు రంగులు వేస్తున్న దృశ్యం

భద్రాచలం, మార్చి 24: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీరామనవమి పనులు ప్రారంభమయ్యాయి. రూ.2,88,62,000 బడ్జెట్‌తో నవమి పనులు చేపడుతుండగా రూ.1.30 కోట్లతో ఇంజనీరింగ్ విభాగం పనులు చేపడుతుండగా మిగిలిన మొత్తం ఇతర ఏర్పాట్లు, అవసరాలకు వినియోగిస్తున్నారు. భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో ఏప్రిల్ 9 నుంచి 23 వరకు వసంతపక్ష ప్రయుక్త శ్రీరామనవమి నవాహ్నిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 17న శ్రీరామనవమి, 18న శ్రీరామ మహాపట్టాభిషేకం నిర్వహించనున్నారు. ఈ క్రమంలో రామాలయం, మిథిలా స్టేడియంలోని శిల్పకళాశోభితమైన కల్యాణ మండపం, వివిధ సెక్టార్లకు రంగులు వేస్తున్నారు. అలాగే భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక వసతి, మిథిలా స్టేడియ ప్రాంగణంలో పెండాల్స్ ఏర్పాటు చేయనున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించనుండగా ఇతరత్రా పనులు సైతం చేపట్టనున్నారు. ఇప్పటికే రామాలయ ప్రాంగణం, కల్యాణ మండపం, సెక్టార్లకు రంగులు వేసే పనులు ప్రారంభించారు.

నేటి నుంచి ఆన్‌లైన్‌లో టికెట్లు

భద్రాద్రి రామయ్య కల్యాణం, మహా పట్టాభిషేకంలను ప్రత్యక్షంగా వీక్షించాలనుకునేవారికోసం భద్రాచలం దేవస్థానం ఆన్‌లైన్ ద్వారా సెక్టార్ టికెట్లను అందుబాటులో ఉంచింది. కల్యాణం వీక్షించే ఉభయదాతల టికెట్ రూ.7,500, సెక్టార్ టికెట్లు రూ.2,500, రూ.2,000, రూ.1,000, రూ.300, రూ.150 టికెట్లు విక్రయించనున్నారు. అలాగే మహాపట్టాభిషేకానికి రూ.1,500, రూ.500, రూ.100 టికెట్లను అందుబాటులో ఉంచారు. కాగా ఏప్రిల్ ఒకటి నుంచి సెక్టారు టికెట్లను భద్రాచలం పట్టణంలోని ఆలయం వద్ద ఉన్న మెయిన్ టికెట్ కౌంటర్లో తానీషా కల్యాణ మండపం(సీఆర్‌వో), బ్రిడ్జిపాయింట్ సీఆర్‌వో, ఆర్డీవో కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా భక్తులకు అందుబాటులో ఉంచనున్నట్లు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి తెలిపారు. కాగా ఈ ఉత్సవాలను ప్రత్యక్షంగా వీక్షించలేని భక్తులకు గతంలో మాదిరిగా పరోక్షంగా భక్తుల గోత్రనామాల పేరిట కల్యాణం జరిపించేందుకు పరోక్ష సేవల కింద రూ.5,000 రూ.1,116ల టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు.



భద్రుడి కోవెలకు రంగులు

ప్రత్యేక సైట్...

సెక్టారు టికెట్లు, పరోక్ష సేవల టికెట్లు టెంపుల్ వెబ్‌సైట్ భద్రాద్రిటెంపుల్.తెలంగాణ.జీవోవీ.ఇన్ ద్వారా సోమవారం నుంచి బుకింగ్ చేసుకునే సదుపాయం కల్పించామన్నారు. ఆన్‌లైన్ ద్వారా సెక్టార్ టికెట్లు బుక్ చేసుకున్న భక్తులు ఏప్రిల్ ఒకటి ఉదయం 11 గంటల నుంచి 17 ఉదయం 6 గంటల వరకు దేవస్థానం తానీషా కల్యాణ మండపం సీఆర్‌వో వద్ద తమ గుర్తింపు కార్డు చూపి ఒరిజినల్ టికెట్లను పొందవచ్చు అన్నారు.

కవిత్వ వస్తువుతోనే సాహిత్య ప్రయోజనం

ఖమ్మం సాంస్కృతికం, మార్చి 23: కవిత్వ వస్తువుతోనే సాహిత్య ప్రయోజనం లభిస్తుందని సీనియర్ కవి, సాహిత్యవేత్త వఝల శివకుమార్ అన్నారు. ప్రముఖ కవి రఘు శేషభట్టర్ రచించిన తాజా కవిత్వ సంకలనం అనల్పం పుస్తక ఆవిష్కరణ నగరంలోని టెండర్ రూట్స్ స్కూల్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. కవి వీఆర్ తూములూరి అధ్యక్షతన జరిగిన సభలో శివకుమార్ అనల్ప పుస్తక పరిచయం చేశారు. కార్యక్రమంలో ఈస్తటిక్ సాహిత్య సంస్థ బాధ్యుడు రవి మారుత్, షకూర్ , రౌతు రవి, కన్నెగంటి వెంకటయ్య, పొత్తూరి సీతరామావు, నందిగామ నిర్మల, ఉరిమళ్ల సునంద, ఫణిమాధవి కన్నోజు, సుభాషిణి తోట తదితరులు పాల్గొన్నారు.



బాహుబలి.. పుట్టగొడుగు

వ్యవసాయ భూమిలో లభ్యం

జాగ్రత్తగా భద్రపరిచిన గ్రామస్థులు

ఆన్‌లైన్‌లో వైరల్

రఘునాథపాలెం, మార్చి 24: లొట్టలేసుకుంటూ అబ్బా ఎంత రుచిగా ఉన్నాయో అని ఆస్వాదించే పుట్టగొడుగుల పరిమాణం ఎంత ఉంటుందో అందరికీ తెలిసిందే. వీటికి భిన్నంగా బాహుబలి రేంజ్‌లో పెద్దగా ఉన్న పుట్టగొడుగు ఓ రైతు వ్యవసాయ భూమిలో లభ్యమైంది. రఘునాథపాలెం మండలంలోని చింతగుర్తిలో మద్దినేని నాగేశ్వరరావు వ్యవసాయ భూమిలో హద్దు రాళ్ల నిర్మాణం కోసం జీడిమెట్ల వెంకటరమణ మరికొందరు వెళ్లారు. ఈ క్రమంలో వ్యవసాయ భూమిలో అతి పెద్ద పుట్టగొడుగు కనిపించటంతో ఆశ్చర్య పోయారు. గ్రామస్థులు పుట్టు గొడుగు ఉన్న వ్యవసాయ భూమికి వెళ్లి తిలకించారు. పుట్టగొడుగుపై తాబేలు ఆకారం కనిపించింది. 15 అంగుళాలు వెడల్పు ఉండగా మొదలు 6అంగుళాలు 5కిలోల బరువు ఉంది. దాన్ని జాగ్రత్తగా బయటకు తీసి గ్రామంలో భద్రపరిచారు. కాగా ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



మాట్లాడుతున్న తోట దేవీప్రసన్న

మోదీ నుంచి రక్షించండి...

» భద్రాద్రి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దేవీప్రసన్న

చుంచుపల్లి, మార్చి24: మోదీ నుంచి దేశాన్ని కాపాడండి అనే నినాదంతో ముందుకు సాగాలని భద్రాద్రి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న పిలుపునిచ్చారు. ఆదివారం చుంచుపల్లిలో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా శక్తిని మేలుకొలిపే విధంగా కార్యక్రమాలు చేయాలని కోరారు. భారత్ జోడో యాత్ర న్యాయ యాత్ర ప్రజల్లో వచ్చిన స్పందన చూసి ఓర్వలేక ప్రజల నుంచి వచ్చిన విరాళాలను స్తంభింపచేశారని మండిపడ్డారు. ఈ సమావేశంలో మహిళ నాయకురాలు సావిత్రి, అనిత, శ్రీలక్ష్మి, భారతి, సుబ్బమ్మ, లక్ష్మి, పార్వతమ్మ పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్ సేవలు వెలకట్టలేనివి: కూనంనేని

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి 24: సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ సేవలు వెలకట్టలేనివని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం కొత్తగూడెం క్లబ్‌లో లయన్స్ క్లబ్ గబ్బేట రీజనల్ మీట్ నిర్వహించగా ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాలలో తమకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకొని అన్ని వర్గాలకు తమకు తోచిన సాయాన్ని అందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా కేంద్రంలో ఇలాంటి రీజినల్ సమావేశాన్ని ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు గబ్బెట రాజయ్య, విజయలక్ష్మీ, లైన్స్ క్లబ్ గవర్నర్ డాక్టర్ సిహెచ్.శివప్రసాద్, మధుసూధన్‌రావు, కోటేశ్వరరావు, కృష్ణారావు, కాపా మురళీకృష్ణ, రాయల శాంతయ్య, వెంకటేశ్వర్లు, శ్రీధర్, జెబి మోహన్, నాగలక్ష్మీ, పారిజాత, వెంకట పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఎన్నడో..?

రబీలో కోతకు వచ్చిన వరి పంట..

రైతులకు ప్రభుత్వం బోనస్ చెల్లిస్తుందా అన్న సంశయం..

ఆందోళనలో అన్నదాత.. తమను ఆదుకోవాలని వేడుకోలు

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

దమ్మపేట, మార్చి 24: రబీపంట చేతికొచ్చినా ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఊసేలేదు. దమ్మపేట మండలంలో గండుగులపల్లి, నాచారం, ఆసన్నగూడెం, మొండివర్రె, శ్రీరాంపురం, లింగాలపల్లి, దమ్మపేట, మండలపల్లి, మొద్దులగూడెం తదితర ప్రాంతాలలో రబీ వరి పంటను దాదాపు 9600ఎకరాలలో పైగా రైతులు సాగు చేసారు. ఆయా గ్రామాలలో 80శాతం పంట చేతికొచ్చి కోతలకు సిద్ధంగా వుంది. వరి పంట 10రోజుల్లో రైతులకు చేతికి రానుంది. ప్రతి సారి ధాన్యం రైతులకు చేతికి వచ్చే సరికి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవటంతో దాళారులు పంటను చేజిక్కించుకునేందుకు రంగంలో దిగటం పరిపాటిగా మారింది. సమయానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవటంతో వచ్చిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు అవకాశంలేక దళారులు అడిగిన రేటుకు ధాన్యాన్ని ఇచ్చి గిట్టుబాటు ధరలేక రైతులు నష్టపోతున్నారు. ముందస్తుగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారని ఆశించిన పంట చేతికి వచ్చే సమయానికి ఏర్పాటు చేయకపోవటంతో ముందుగా పంట చేతికి వచ్చిన రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పాడుతుంది. వ్యవసాయాధికారులు ప్రణాళిక లేకుండా పంట చేతికి వచ్చిన తరువాత హడావుడిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు రివాజుగా మారింది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన సమయానికి గన్నిసంచులు లేకపోవటం, లోడింగ్‌కు సమయానికి లారీలు రాకపోవటం, ధాన్యం కొనుగోలులో మిల్లర్లు ధాన్యాని తీసుకోకనిరాకరించటం తరుగు పేరుతో కోతలు విధించటం, హామాలీలు వుండకపోవటంతో రైతులు తరచూ అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి త్వరితగతిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సమస్యలు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు ప్రభుత్వం బోనస్ చెల్లిస్తుందా....?

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధాన్యానికి క్వింటాకు 500రూాలు చెల్లించటం జరుగుతుందని కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు. కాని ఆహామి ఇప్పటి వరకు నెర వేరలేదు. ఖరీఫ్‌లో ధాన్యానికి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బోనస్ ఇస్తుందని ఆశించిన రైతులకు బోనస్ దక్కలేదు. ప్రభుత్వ హామీ రబీలో సాగు చేసిన వరిపంటకైన బోనస్ వస్తుందా అని ఎదురు చూస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై పౌరసరఫరాలశాఖా డిటి వెంకటేశ్వర్లను వివరణ కోరగా తమకు ప్రభుత్వం నుండి ఎలాంటి సమాచారం లేదని ముక్తసరిగా సమాదానం చెప్పారు.



కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

దళారుల రాజ్యం...

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారుల రాజ్యం ఏర్పాటైంది. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని ఇష్టారీతిన దండుకుంటున్నారన్న విమర్శలున్నాయి. ధాన్యాన్ని దాచుకునే స్థలం లేక, కొనుగోలు కేంద్రాలు లేక దళారులు అడిగిన ధరకు ధాన్యం అమ్ముకోవాల్సిన దుస్థితిలో రైతులు పడ్డారు.

రాములోరి పెళ్లికి గోటి తలంబ్రాలు

భద్రాద్రికి పాదయాత్రగా పయనమైన భక్తులు



గోటి తలంబ్రాలతో పయనమైన భక్తులు

సుజాతనగర్, మార్చి 24: మండల కేంద్రంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్న కేశవస్వామి ఆలయ అర్చకులు కంజర్ల సత్యన్నారాయణాచార్యుల పర్యవేక్షణలో ఆలయ భక్త బృందం గోటి తలంబ్రాలతో పాదయాత్రగా రాములోరి చెంతకు ఆదివారం పయనమయ్యారు. రాములోరి కళ్యాణానికి గోటితో చేసిన తలంబ్రాలనే వాడటం సంప్రదాయం. ఈ సంవత్సరం కూడా భక్తులు గోటితో తలంబ్రాలను చేయడానికి పూనుకున్నారు. ఈ నెల 16 నుంచి మార్చి 23 వరకు గోటితో వలిచిన బియ్యాన్ని (తలంబ్రాలను) గ్రామంలోని పురవీధుల్లో శనివారం సాయంత్రం శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం సోమవారం ఉదయాన్నే భద్రాద్రిలో సమర్పించటానికి పాదయాత్రగా పయనమయ్యారు. కార్యక్రమంలో సుజాత, నాగలక్ష్మి, సౌజన్య, పద్మావతి, శ్రీదేవి, వెంకటలక్ష్మి, కవిత, మాధవి, ప్రమీల, లక్ష్మి, భారతమ్మ, పావని, శైలజ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు నుంచి..

జూలూరుపాడు: గోటితలంబ్రాలను సమర్పించేందుకు రామభక్తులు భద్రాచలానికి పాదయాత్రగా తరలివెళ్లారు. మండలంలోని జూలూరుపాడు, వెంగన్నపాలెం, గుండెపూడి, పాపకొల్లు, కొత్తూరు, కాకర్ల తదితర గ్రామాలకు చెందిన రామభక్తులు ఆదివారం తెల్లవారుఝామున అయా గ్రామాల్లోని అలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి తలంబ్రాలతో పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. రామనామస్మరణను ఆలపించారు. గత 30 రోజులుగా అయా గ్రామాల్లోని ఆలయాల్లో సిద్ధం చేసిన తలంబ్రాలను భద్రాచలంలోని రామాలయంలో అప్పగించేందుకు వెళ్తున్నట్లు వారు తెలిపారు.

లెప్రసీ సర్వే విజయవంతం



గ్రామంలో ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

మణుగూరు, మార్చి 24: మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఈ నెల 11 వతేది నుంచి ఆదివారం వరకు నిర్వహించిన లెప్రోసీ సర్వే విజయవంతం అయిందని నోడల్ పర్సన్ రాంప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఇంటింటా సర్వేను చేపట్టడం జరిగిందన్నారు. అనుమానిత కేసులను ఆసుపత్రికి తరలించి పరీక్షలు నిర్వహించగా వారికి చర్మ వాధులు తప్ప లెప్రోసీ లేదని నిర్ధారించడం జరిగిందన్నారు. గ్రామాల్లో కూడా కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహణ కల్పించామన్నారు. ఈ కార్యక్ర మాల్లో ఆశా వర్కర్లు సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

ముగిసిన పోషన్ పక్వాడ్ వేడుకలు

మణుగూరు , మార్చి 24: మణుగూరు మండల పరిధిలోని ఐసీడీఎస్ పరిధిలో గల పలు సెక్టార్ల పోషన్ పక్వాడ్ వేడుకలు ఎంతో ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమాల్లో బాగంగా మండలంలోని మణుగూరు సెక్టార్ పరిధిలోని ఆదర్శనగర్, మామిడితోట గుంపు, అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్బిణులకు ఎంతో ఘనంగా సామూహిక సీమంతాల కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు స్థానిక సూపర్‌వైజర్ సుశీల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీమంత కార్యక్రమాలతో పాటు స్థానిక చిన్నారులకు అక్షరాభ్యాసాలను, అన్న ప్రాసన కార్యక్రమాలను చేయించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో సూపర్‌వైజర్ సుశీల మాట్లాడుతూ.. మహిళలు గర్బిణీ దశ నుంచి సమతుల ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆనాడే తల్లి బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. ఆకుకూరల్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయని ప్రతి రోజు ఆకుకూరలని తీసుకోవాలన్నారు. చిరుధాన్యాలు సీజనల్ గా దొరికే పండ్లు ఎక్కువ తీసుకుంటే తల్లి బిడ్డలకు మంచిదన్నారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారితో ప్రతిజ్ఞ చేయించారు. కేంద్రాల సమీప వీధుల్లో ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి హిమబిందు, అంగన్‌వాడీ టీచర్ ఆయాలు శ్యామల, స్వరూపరాని, కె సుజాత, ఎన్ ధనలక్ష్మి గర్బిసీలు బాలింతలు స్థానిక మహిళలు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా

టేకులపల్లి, మార్చి 24: కేవోసీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం కేవోసీ కార్యాలయం ముందు సింగరేణి కార్మికులు ధర్నా నిర్వహించారు. కేవోసీ కార్మికులకు నెలవారీ ఇన్‌సెంటీవ్స్ చెల్లించాలని, ఫిట్-1 ప్రాంతంలో శుద్ధినీటి ప్లాంటును ఏర్పాటు చేయాలని కోరుతూ కేవోసీ ఇన్‌చార్జి మేనేజర్ కేఎస్ఎన్ రాజుకు వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్, సహాయ కార్యదర్శి కొంగర వెంకటేశ్వర్లు, బీసీ సంఘం ఉపాధ్యక్షులు ఎస్వీఎస్ఎన్ రాజు, ఫిట్ సహాయ కార్యదర్శి సర్వర్, వెంగళ రవి, సామల శ్రీనివాస్, పవన్‌కుమార్, వెంకటప్పయ్య, కనకరాజు, బాపిసింగ్, కిషోర్, జాన్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీతాయారు అమ్మవారికి కంఠాభరణం

భద్రాచలం, మార్చి 24: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో లక్ష్మీతాయారు అమ్మవారికి భద్రాచలంకు చెందిన దేశరాజు వెంకట శంకరరావు రూపశ్రీ దంపతులు కంఠాభరణంను సమర్పించారు. ఆదివారంనిత్యకల్యాణంలో పాల్గొన్న ఆ దంపతులు అనంతరం దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి పర్యవేక్షకులు లింగాల సాయిబాబాలకు కంఠాభరణం లాంఛనంగా అందజేశారు. ఈ ఆభరణం 39 గ్రాములు ఉంది. కాగా దీని విలువ రూ2.25 లక్షలని అధికారులు తెలిపారు. ఎరుపు, తెలుపు పచ్చటి రాళ్లు, ముత్యాలతో కూడిన ఈ కంఠాభరణం లక్ష్మీతాయారు అమ్మవారి అలంకరణ నిమిత్తం వినియోగించనున్నారు.

తిరుపతిరావు కుటుంబానికి పాయం పరామర్శ

మణుగూరు , మార్చి 24: మణుగూరు పట్టణంలోని డాక్టర్ తిరుపతిరావు ఇటీవల మృతిచెందారు. ఆదివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తిరుపతిరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నేటినుంచి ప్రతిష్ఠా మహోత్సవాలు

అశ్వారావుపేట రూరల్, మార్చి 24: అశ్వారావుపేటలోని ఏఎస్ఆర్ నగర్‌లో నూతనంగా నిర్మించిన ఆలయంలో వినాయకుడి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం నుంచి జరుగుతాయని ఆలయ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. మూడు రోజుల ప్రత్యేక పూజలు, హోమాల అనంతరం బుధవారం ఉదయం 8.13గంటలకు విఘ్నేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరగనుంది. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమాలకు, ప్రతిష్ఠా మహోత్సవ వేడుకలకు భక్తులు అధికంగా తరలిరావాలని నిర్వాహకులు కోరారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 10 సైకిళ్ల పంపిణీ

భద్రాచలం, మార్చి 24: రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం వారి ఆధ్వర్యంలో ఆదివారం భద్రాచలంలో నిరుపేద విద్యార్థినులకు ఉచితంగా 10 సైకిళ్లను రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాలయం, హైదరాబాద్ నార్త్‌క్లబ్ వారి సహకారంతో పంపిణీ చేశారు. ఈ సైకిళ్లను రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం అధ్యక్షురాలు శ్రీమహాలక్ష్మీ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి విద్యాసాగర్, యశోద రాంబాబు, నాగేశ్వరరావు, మునికేశవ్, రఫీ, అజయ్‌కుమార్, సానికొమ్ము బ్రహ్మారెడ్డి, జక్కంవేణు, పలివెల రవికుమార్, ఎస్.కె.అజీమ్, వీరభద్రం, చలపతి, ప్రసన్నకుమార్, రాజేష్ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, మార్చి 24: భద్రాచలంలోని సీతారామనగర్ కాలనీలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణదారణ, యజ్ఞోపవీతదారణ, జీలకర్రబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనంతో కల్యాణ ప్రక్రియ ముగిసింది. కల్యాణ వేడుకలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు దంపతులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

కరకగూడెం, మార్చి 24: మండలంలోని వలస ఆదివాసీ గ్రామాలలో తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మడివి రమేష్, సీపీఎం మండల కార్యదర్శి కొమరం కాంతారావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని రేగళ్ల గ్రామంలో పర్యటించిన వారు గ్రామస్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవి కాలం రీత్యా తాగునీటి కోసం ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మారుమూల గ్రామాలలో నివసిస్తున్న వలస ఆదివాసులను ఓటు కోసం మాత్రమే వాడుకుంటున్నారని తరువాత గ్రామాలను పట్టించుకునే నాధుడే కరువయ్యారని.. అధికారులు నిధులు లేవనే కారణంతో సమస్యలను పరిష్కరించడంలో వైఫల్యం చెందుతున్నారని మండి పడ్డారు.

నగర సంకీర్తన కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

పాల్వంచ టౌన్, మార్చి 24: ఏప్రిల్ 4న జరగనున్న గుట్ట వెంకన్న వార్షిక కల్యాణంలో భాగంగా నగర సంకీర్తన కరపత్రాలను ఆదివారం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ ఆవిష్కరించారు. గుడిపాడు మోక్ష వెంకటేశ్వరస్వామి వారి కల్యాణంలో పాల్గొన్న అనంతరం గుట్ట వెంకన్నను పాదాల మండపం వద్ద దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నగేష్ శర్మ ఆయనకు ఘన స్వాగతం పలికారు.

మోదీని విమర్శించే స్థాయి కూనంనేనికి లేదు

పాల్వంచ టౌన్, మార్చి 24: ప్రధాని నరేంద్రమోదీని విమర్శించే స్థాయి ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు లేదని మాజీ బీజేపీ జిల్లా అధ్యక్షుడు, ఐకార్ బోర్డు మెంబరు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా ప్రధానిని విమర్శించడమే పనిగా ఎమ్మెల్యే కూనంనేని వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రపంచ దేశాలు ప్రధానిని విశ్వగురువుగా కీర్తిస్తుంటే అయనకు కనపడటం లేదా అని అన్నారు. గత ప్రభుత్వం అనేక అవినీతి పనులకు పాల్పడిందని విమర్శించిన మీరు ఆ విషయంలో ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. మిత్రపక్షం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక ప్రజా సమస్యలపై స్పందించకపోవడంపై ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ప్రధాని మోదీ ఈడీ, సీబీఐని వాడుకుని ప్రతిపక్షాలను దెబ్బతిస్తున్నారని అనడం సరికాదన్నారు. గతంలో లిక్కర్ కేసులో కవితను అరెస్టు చేయలేదని, బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనన్న మీరు కవితను ఈడీ అరెస్టు చేస్తే రెండు నాలుకల ధోరణితో ఇప్పుడు మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఈ సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గసభ్యులు లిట్టి మురళీ, పట్టణ అధ్యక్షుడు రాపాక రమేష్, నాయకులు మనుపురి ప్రభాకర్, గంధం ప్రసాద్ గౌడ్, భూక్య రవి, కే. రంజిత్, లక్ష్మణ్, నరేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి: డీఎస్పీ

ఇల్లెందుటౌన్, మార్చి 24: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పక్షాలు సహకరించాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రబాను కోరారు. ఆదివారం ఇల్లందులో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఎన్నికల నిబంధనల ప్రకారం రాజకీయ పార్టీలు నడుచుకోవాలని సూచించారు. ప్రచార సందర్భంలో రెచ్చగొట్టే వాఖ్యలు చేయవద్దని, ప్రసంగాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ర్యాలీలు, సభలు సమావేశాలు నిర్వహించేందుకు పోలీసు అధికారుల అనుమతి తీసుకోవాలని కోరారు. ఎన్నికల్లో పోలీసులకు సహకరిస్తే, తరువాత పోలీసులం సహకరిస్తామని ప్రకటించారు. పరస్పరం సహాయసహకారాలు అందించుకోవాలని తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలని నియోజకవర్గంలో ఎన్నికలు ఎప్పుడు కూడా ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. ఎన్నికల చట్టాలు కఠినంగా ఉన్నాయని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఇల్లెందు సీఐ టి.కరుణాకర్, కాంగ్రెస్ నాయకులు డానియల్, సుదర్శన్‌కోరి, సాంబమూర్తి, టీడీపీ నాయకులు ముద్రగడ వంశీ, సీపీఎం నాయకులు నబీ, ఆలేటి కిరణ్, సీపీఐ నాయకులు సారయ్య, నాగయ్య, శంకర్, ఎన్డీ నాయకులు మధు, నాగేశ్వరావు, శావళి, బీఆర్ఎస్ నాయకులు దిండిగల రాజేందర్, జేకే శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇల్లెందు డీఎస్పీ చంద్రబాను

తిరుకల్యాణానికి అంకురారోపణ

దుమ్ముగూడెం, మార్చి 24: భద్రాచల సీతారామచంద్రస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన పర్ణశాల రామాలయంలో స్వామివారి తిరుకళ్యాణ మహోత్సవానికి ఆదివారం అంకురారోపణ నిర్వహించారు. నిత్య హోమం, విశేష ప్రసాద నివేదనలను శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ నెల 25న డోలోత్సవం, వసంతోత్సవాలకు ఏర్పాట్లు చేశారు. ముఖ్య అర్చకులు కిరణ్‌కుమారాచార్యులు, పొడిచేటి రామభద్రాచార్యులు, అమరవాది వెంకట్రామన్, నరసింహాచార్యులు, ఆలయ ఇంచార్జి ప్రసాద్, ఫెస్టివల్ అధికారి అనీల్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించిన అధికారులు

దుమ్ముగూడెం, మార్చి 24: నారాయణరావుపేట గ్రామపంచాయతీ పొలూరిపేట ఆదివాసీలు కొద్ది రోజులుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మండల కార్యదర్శి సాయన్న ఆదివారం డిమాండ్ చేశారు. ఆదివాసీలతో కలిసి తాగునీటి సమస్యను విలేకరులకు వివరించారు. మిషన్ భగీరధ పథకం పనిచేయకపోవడంతోపాటు, కొన్ని బోర్లు సక్రమంగా పనిచేయడం లేదని తెలిపారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలని జిల్లా కలక్టర్ ఆదేశించినా సమస్య పరిష్కారమవడం లేదని వారు ఆరోపించారు. ఆదివారం శెలవు దినం ఐనప్పటికీ సమస్య తెలిసిన వెంటనే ఎంపీవో ముత్యాలరావు, కార్యదర్శి రంజిత్‌లు అక్కడకు చేరుకొని చేతిబోరుకు మరమత్తులు చేయించి తాగునీటిని అందుబాటులోకి తెచ్చారు.

'పార్టీ పటిష్టతకు కృషి చేస్తా'

పాల్వంచ టౌన్, మార్చి 24 : కాంగ్రెస్ పార్టీ పటిష్టతతోపాటు మైనార్టీల అబివృద్ధికి తన శక్తివంచన లేకుండ కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ అనుబంధ మైనార్టీ సెల్ మండల అధ్యక్షునిగా నియమితులైన షేక్ ఖాజా మియా అన్నారు. ఆదివారం పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనకు ఈ పదవి అప్పగించిన డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, డీసీసీ మైనార్టీ అధ్యక్షులు మహమూద్ ఖాన్‌లతోపాటు జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, భట్టి విక్రమార్కులకు, ఎంపీ రేణుకాచౌదరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పాల్వంచ ముస్లీం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు ఎస్ఎ. రహమాన్, ఎస్‌కే. గౌస్‌పాషా, ఎండి. యూసుఫ్, ఎస్‌కే. కరీం (కిరాణం), ఎస్‌కే. కరీం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్

జూలూరుపాడు, మార్చి 24: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముస్లీం సోదరులకు ఇఫ్తార్‌విందును ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం జూలూరుపాడులోని మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందును కాంగ్రెస్ జిల్లా నాయకులు, సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి ప్రారంభించారు. ముస్లీం సోదరులు రంజాన్ పర్వదినాన్ని సుఖ సంతోషాలతో జరుపుకోవాలని కోరారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష ఎంతో కఠినమైనదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దుద్దుకూరి మదుసూదన్‌రావు, వేల్పుల నర్సింహారావు, నర్వనేని పుల్లారావు, వై.నాగేశ్వరరావు, జామామసీదు అధ్యక్షుడు ఎస్‌కే. యాసీన్, ఎస్‌కే. ఖాసీం, ఎస్‌కే. సిద్దిక్, ఎస్‌కే. కరీముల్లా, ఎస్‌కే. షైబు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పంచామృత అభిషేకం

మణుగూరు , మార్చి 24: మండలంలోని కూనవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆలయ ప్రాంగణంలో గత రెండు రోజులుగా యాగశాలలో విశేష పూజలందుకున్న సీతా రామ లక్ష్మణ, అంజనేయ విగ్రహాలకు పంచామృత అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక గ్రామవాసులే కాకుండా పరిసర ప్రాంతాల నుంచి కూడా వందల సంఖ్యలో భక్తులు ఈ అభిషేక కార్యక్రమ పూజల్లో పాలు పంచుకున్నారు. జై శ్రీరామ్; జై హనుమాన్ జైజై ధ్వానాలతో ఆలయ ప్రాంగణం మార్మోగి పోయింది.

ఘనంగా పెద్దమ్మతల్లి జాతర

ములకలపల్లి, మార్చి 25: ములకలపల్లి మండలంలోని మాదారం గ్రామంలో ఆదివారం సంప్రదాయంగా ఆదివాసీ నాయకపోడు గిరిజన పెద్దమ్మతల్లి జాతరను ఘనంగా నిర్వహించారు. పాండవులు వారసులైన నాయకపోడులు నాయకరాజ్యాలు యేలిన ఉనికికి గుర్తుగా వారి రాజ్యాల్లోని గుర్తులను స్మరించుకుంటు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి జరుపుకునే కొలువు (జాతర) పెద్దమ్మతల్లి జాతర. ఈ జాతర సందర్భంగా వారం రోజులు వివిధ కార్యక్రమాలతో జాతర నియమ, నిష్టలతో జరుపుకుంటారు. ఈ కొలువు సందర్భంగా పులిమీద ఆశీనులైన స్త్రీశక్తి స్వరూపాన్ని పెద్దమ్మతల్లిగా భావిస్తుంటారు. అడవి నుంచి సంద్ర చెట్లను తీసుకొచ్చి జాతర జరిగే నగురు ప్రాంతంలో ఉంచి అగ్నిగుండాలను ఏర్పాటు చేసి భక్తిశ్రద్దలతో సంద్ర అగ్నిగుండాల్లో భక్తులు నడుస్తారు. ఈ పూజలో ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పసుల బుచ్చయ్య, గ్రామ పెద్దలు గణపా సత్తయ్య, ఊకంటి రవికుమార్, గంపా బోడయ్య, ఊకంటి చిట్టిబాబు, లక్ష్మీనారాయణ, ముదిగొండ వెంకటేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

